News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :174 | ఖమ్మం | శుక్రవారం, ఆగస్టు 8, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారు... బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడేమయ్యాయి?

- భారత్‌పై అమెరికా 50 శాతం సుంకం విధించడంపై ఒవైసీ తీవ్ర ఆగ్రహం
- ఇది దౌత్యం కాదు, ట్రంప్ దాదాగిరి అంటూ ఘాటు విమర్శ
- సుంకాల వల్ల ఉద్యోగాలు పోతాయి, ఎఫ్‌డీఐలు రావని ఆందోళన
- ప్రధాని మోదీ 56 అంగుళాల ఛాతీ ఏమైందని సూటి ప్రశ్న
- దేశ సార్వభౌమత్వాన్ని మిత్రుల కోసం తాకట్టు పెట్టారని ఆరోపణ



భారత్‌పై అమెరికా భారీ సుంకాలను విధించడంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా 50 శాతం సుంకం విధించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇది దౌత్యం కాదని, అమెరికా అధ్యక్షుడి దాదాగిరి

వివరాలు 2లో..

## యువత వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి

- జాతీయ చేనేత దినోత్సవంనాడు నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్
- చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- మరమగ్గాలకు 500 యూనిట్ల దాకా కరెంట్ ఫ్రీ
- ఆప్కో కొనుగోళ్లపై 5 శాతం జీఎస్టీ రాయితీ
- నేతన్నల కోసం త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం
- చేనేతకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ



జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేత కార్మికులకు శుభవార్త చెప్పింది. చేనేత రంగానికి అండగా నిలుస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇందులో భాగంగా

వివరాలు 2లో..

## ఇది తెలంగాణ ప్రజలను..

### బీసీ రిజర్వేషన్ల కోసం మా ప్రయత్నాలన్నీ చేశాం

# అవమానించడమే..

### రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు

### కానీ మోడీ, అమిత్ షా ముర్మును కలిశారు

### మాకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా కేంద్రం కుట్ర

### ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడు తున్న తమకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు అడ్డుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఇది తెలంగాణ ప్రజలను అవమానించడమేనన్నారు. బీసీల 42% రిజర్వేషన్ల బిల్లుపై బుధవారం జంతర్‌మంతర్‌లో ధర్నా చేపట్టిన ఆయన.. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం గురువారం సాయంత్రం వరకు ఎదురుచూశారు. రాకపోవడంతో సీఎం ఇక్కడి తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. "మేం రాష్ట్రపతిని అపాయింట్‌మెంట్ అడిగిన తర్వాత మోదీ, అమిత్‌షా రాష్ట్రపతిని కలిశారు. రాష్ట్రపతి మాకు అపాయింట్‌మెంట్ ఇస్తే రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది కాబట్టి.. మాకు ఆ అవకాశం రాకుండా వారిద్దరూ అడ్డుకున్నట్లు పీసీసీ అధ్యక్షుడు, మా మంత్రివర్గ సహచరులు నిర్ధారణకు వచ్చారు. మూడు రోజులుగా తెలంగాణ మంత్రివర్గమంతా దిల్లీలోనే ఉండి రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూసినా దొరకలేదు. బలహీనవర్గాల హక్కులను కాలరాయడానికి భాజపా ఆది నుంచీ కుట్రలు చేస్తూనే ఉంది. నాడు రథయాత్ర పేరుతో దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు సృష్టించి, మండల్ కమిషన్ సిఫార్సులు అమలు కాకుండా అడ్డుకుంది. తర్వాత సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్‌ల నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వం ఐఐటీ, ఐఐఎం, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో బీసీ రిజర్వేషన్లకు నిర్ణయించినప్పుడు కూడా యూత్ ఫర్ ఈక్వాలిటీ పేరిట అడ్డుకోవడానికి భాజపా ప్రయత్నించింది. కానీ సోనియా, మన్మోహన్‌సింగ్‌లు పట్టుదలతో వాటిని అమలు చేసి చూపారు. ఇప్పుడు మేం బీసీల 42% రిజర్వేషన్లకు సిద్ధమైతే భాజపా మరోసారి అడ్డుకుంటోంది.

ఇండియా కూటమి నేతలకు దిల్లీలోని తన నివాసంలో రాహుల్‌గాంధీ ఇచ్చిన విందుకు హాజరైన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

**మా బిల్లుల్లో మత ఆధారిత రిజర్వేషన్లు లేవు**

మేం చేసిన బిల్లులో లోపాలుంటే ఓబీసీ రిజర్వేషన్లపై భాజపా విధానమేంటో చెప్పాలి. మీ ఆలోచన ప్రకారమే పార్లమెంటులో చట్టం చేయాలని

వివరాలు 2లో..

## 'బెంగళూరును పేల్చేయండి'

### పాక్ సైన్యాధిపతిని కోరిన శమాపర్వీన్



అల్‌ఖైదా సిద్ధాంతానికి మద్దతు ఇస్తూ ఇటీవల బెంగళూరులో దొరికిపోయిన శమా పర్వీన్ అనే మహిళను జాతీయ దర్యాప్తు సంస్థ, గుజరాత్ ఏటీఎస్ అధికారులు విచారించగా.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో బెంగళూరును పేల్చేయాలని పాక్ సైన్యాధిపతి అసీమ్ మునీర్‌ను ఆమె కోరిందని అధికారులు గుర్తించారు.

వివరాలు 2లో..

## ఈ నెలలో వరుస అల్పపీడనాలు

### రాబోయే రెండు వారాల్లో వర్షాలకు అవకాశం



వర్షాకాలంలో వేసవి తరహా వాతావరణంతో అవస్థలు పడుతున్న రాష్ట్ర ప్రజలకు ఉపశమనం లభించనుంది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారాయి.

వివరాలు 2లో..

## యువత వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి

- జాతీయ చేనేత దినోత్సవంనాడు నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్
- చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- మరమగ్గాలకు 500 యూనిట్ల దాకా కరెంట్ ఫ్రీ
- ఆప్కో కొనుగోళ్లపై 5 శాతం జీఎస్టీ రాయితీ
- నేతన్నల కోసం త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం
- చేనేతకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ



వివరాలు 2లో..

# ఢీ అంటే ఢీ

- అమెరికా సుంకాలపై దీటుగా స్పందించిన భారత్
- రైతుల ప్రయోజనాలే ముఖ్యమన్న మోదీ
- భారాన్ని భరిస్తామని స్పష్టీకరణ
- మరిన్ని ఆంక్షలకు సిద్ధమన్న ట్రంప్
- అమల్లోకి వచ్చిన 25% సుంకాలు
- అమెరికాలో పెరగనున్న ధరలు

వివరాలు 2లో..



రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ విషయంలో రెండు దేశాలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి

## గంటలోనే కుండపోత

### యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో 14.8 సెం.మీ.

### రంగారెడ్డి జిల్లా ఖాజాగూడలో 13.15 సెం.మీ.

### జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా ఈదురు గాలులతో వాన

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ మహానగరంతో పాటు పలు జిల్లాల్లో గంట వ్యవధిలోనే కుండపోత వర్షం కురిసింది. ఈదురు గాలులతో ప్రారంభమై ఆగమాగం చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో 14.8 సెం.మీ., నల్గొండ జిల్లా శాలిగౌరారంలో 13.6 సెం.మీ., రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో 13.15 సెం.మీ.

వివరాలు 2లో..

# ఇది తెలంగాణ ప్రజలను అవమానించడమే

కోరుతున్నా. ముస్లింలకు 10% రిజర్వేషన్లు ఏ బిల్లులో ప్రతిపాదించామో చూపాలని కిషన్‌రెడ్డిని సవాల్ చేస్తున్నా. కేంద్రమంత్రిగా ఉండి గల్లీ నాయకుడిలా మాట్లాడటం భావ్యం కాదు. మా రిజర్వేషన్ బిల్లులో మతం ఆధారంగా రిజర్వేషన్లు లేవు. స్థానిక సంస్థల్లో మొత్తం బీసీలకు కలిపి 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పాం తప్ప.. అందులో ఉపకులాలు లేవు. కానీ కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బిల్లులు చదివారో, చదవకుండానే మాట్లాడుతున్నారో తెలియదు. బిల్లులో ఏయే కులాలున్నాయో కిషన్‌రెడ్డికి అధికారికంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తాం. కావాలంటే కేంద్ర సామాజిక న్యాయ, సాధికార శాఖ మంత్రిని కూడా ఆహ్వానిస్తాం. లేదా యంత్రాంగాన్నంతా దిల్లీకి తీసుకొచ్చి కిషన్‌రెడ్డి అనుమానాలు తీరుస్తాం. ముస్లింలను తొలగించి బీసీలకు 42% బీసీ రిజర్వేషన్లు ఇస్తామని పార్లమెంటులో బిల్లుపెట్టి పాస్ చేయించాలని కిషన్‌రెడ్డిని డిమాండ్ చేస్తున్నా.

**భారత రాష్ట్ర సమితి శిఖండి పాత్ర**

2017లో రాజస్థాన్ నుంచి అబ్దుల్‌సత్తార్ అనే ముస్లిం ఓబీసీ రిజర్వేషన్ల ఆధారంగా ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 1971 నుంచి నూర్‌బాషా, దూదేకుల లాంటి ముస్లింలకు మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో చట్టప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చినట్లు నరేంద్రమోదీయే స్వయంగా పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. కానీ అదే ముస్లింల పేరు చెప్పి భాజపా తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోంది. బీసీ రిజర్వేషన్ల విషయంలో భారత రాష్ట్ర సమితి శిఖండి పాత్ర పోషిస్తోంది. కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికి.. భాజపాతో అంటకాగడానికి ఆ పార్టీ సిద్ధమైంది. అందుకే భాజపా తప్పులను ప్రశ్నించడం కానీ, మా ధర్నాలో పాల్గొనడం కానీ చేయలేదు. పైగా మమ్మల్ని అవహేళన చేస్తోంది. అందుకే తెలంగాణ సమాజం ఆ రెండు పార్టీలను బీసీ ద్రోహులుగా భావిస్తోంది.

**పీఏసీలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ**

రిజర్వేషన్ల భవిష్యత్తు కార్యాచరణపై రాజకీయ సలహా కమిటీ (పీఏసీ)లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కేంద్ర ప్రభుత్వంపై న్యాయపరంగా, ప్రజాపోరాటాల ద్వారా ఎలా ఒత్తిడి తీసుకురావాలో చర్చిస్తాం. 42% రిజర్వేషన్లకు ఇంకా ఆమోదం రాలేదు కాబట్టి స్థానిక ఎన్నికల్లో వాటిని పార్టీపరంగా అమలు చేయడంపైనా చర్చించి నిర్ణయానికి వస్తాం. గవర్నర్లు, రాష్ట్రపతి తమవద్దకు వచ్చిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా.. మళ్లీ ఆ అంశాన్ని రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు రిఫర్ చేశారు. సర్వోన్నత న్యాయస్థానం ఇప్పుడు దానిపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు కోరింది. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని కోర్టుకు తెలియజేస్తాం.

**రాష్ట్రంలో మళ్లీ గెలిచి చూపుతాం**

2028లో మళ్లీ మేం తెలంగాణలో గెలవడం ఖాయం. 2029 ఎన్నికల్లో భాజపాను ఓడించి కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమూ ఖాయం. రాహుల్‌గాంధీ, ఖర్గే బుధవారం నాటి ధర్నాకు రాలేదని కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారు. వారు గతంలో ఇందిరాభవన్‌లో, తాల్కటోరా స్టేడియంలో జరిగిన సదస్సులకు హాజరై తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కాకపోతే కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఓబీసీ రిజర్వేషన్ల పెంపును అమలు చేసి చూపుతాం. రాహుల్ ఆలోచనలకు అడ్డొచ్చేవారందరినీ పక్కకు తోసేసి ముందుకు వెళ్తాం” అని రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

**బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికి ఒత్తిడి పెంచండి**

ఖర్గేతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.., చిత్రంలో సీతక్క, సురేఖ, పొన్నం, మహేశ్‌కుమార్‌గౌడ్, బలరాంనాయక్, రామచంద్రునాయక్, వాకిటి శ్రీహరి, వివేక్, పొంగులేటి, వంశీకృష్ణ, విశ్వనాథన్, మల్లు రవి, సురేశ్ షెట్కార్, అద్లూరి లక్ష్మణ్, చామల, అనిల్‌కుమార్‌యాదవ్, రఘురాంరెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్‌నాయక్, శ్రీధర్‌బాబు, జూపల్లి, జితేందర్‌రెడ్డి

బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడానికి అసెంబ్లీలో పాస్ చేసి పంపిన బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపేలా పార్లమెంటులో ఒత్తిడి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి విజ్ఞప్తి చేశారు. గురువారం ముఖ్యమంత్రి తన మంత్రివర్గ సహచరులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పార్లమెంటు భవనంలోని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడి కార్యాలయంలో ఖర్గేతో సమావేశమై దీని గురించి చర్చించారు. ఇదే అంశంపై బుధవారం జంతర్‌మంతర్‌లో నిర్వహించిన ధర్నా వివరాలను చెప్పి తెలంగాణ బీసీలకు సామాజిక న్యాయం చేసేందుకు పార్టీపరంగా చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. రాష్ట్రంలో రిజర్వేషన్ల సవరణకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను ఆమోదించకుండా గవర్నర్ నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్న విషయాన్నీ ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలను వివరించడానికి రాష్ట్రపతి అపాయింట్‌మెంటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

# గంటలోనే కుండపోత

- మొదటి పేజి తరువాయి

వర్షపాతం నమోదైంది. మహానగర పాలక సంస్థ వ్యాప్తంగా అనేక చోట్ల 5-11 సెం.మీల మధ్య వర్షం కురిసింది. ప్రధాన రహదారులు ఏరులై ప్రవహించాయి. పలు వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలో.. యూసఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో వరద పోటెత్తింది. భుజాల్లోతున నీరు ప్రవహించింది. నగరవ్యాప్తంగా పలు చెట్లు కూలాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్ గోడ రోడ్డుపై ప్రయాణిస్తున్న కారుపై పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. సాయంత్రం నుంచే ఓ మోస్తరు వర్షం ప్రారంభమైనా ఆరు గంటల నుంచి ఏడు గంటల మధ్య ఒక్కసారిగా ఉద్ధృత రూపం దాల్చింది. ఐటీ కారిడార్ మొదలు కూకట్‌పల్లి, అమీర్‌పేట, ఖైరతాబాద్, మలక్‌పేట, ఎల్బీనగర్, ఉప్పల్, సికింద్రాబాద్, మెహిదీపట్నం, అత్తాపూర్ ప్రధాన మార్గాల్లో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. కంటోన్మెంట్‌లోని పికెట్‌నాలా పొంగిపొర్లడంతో రసూల్‌పురలోని ప్యాట్నీ కాలనీ మరోసారి నీట మునిగింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో బోట్లతో సహాయక చర్యలు చేపట్టారు. వాతావరణం అనుకూలించకపోవడంతో గువాహటి నుంచి హైదరాబాద్ వస్తున్న విమానాన్ని గన్నవరానికి మళ్లించారు. వరద పరిస్థితిపై హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులు సమీక్షించారు.

మణికొండ లక్ష్మీనగర్‌లో సెల్లార్‌లోకి చేరిన వరద

**నేడు, రేపు భారీ వర్షాలు**

మహబూబ్‌నగర్, వనపర్తి, వికారాబాద్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిశాయి. రుతు పవన ద్రోణి కారణంగా శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ గురువారం తెలిపింది. నల్గొండ, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది.

**సమన్వయంతో పనిచేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి**

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. దిల్లీలో ఉన్న ఆయన ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. సీఎస్, డీజీపీతో పాటు జీహెచ్‌ఎంసీ, హైడ్రా కమిషనర్, విద్యుత్ విభాగం అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. విపత్తు నిర్వహణ బృందాలను సంసిద్ధంగా ఉంచాలన్నారు. కలెక్టర్లు జిల్లాల్లోని అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, హైదరాబాద్ ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్నారు. అధికారులు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ఖైరతాబాద్- లక్డీకాపూల్ మార్గంలో నిలిచిన వాహనాలు**

**ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలి: సీఎస్**

వర్షాలకు ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.రామకృష్ణారావు ఆదేశించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి గురువారం రాత్రి సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలన్నారు. అధికారులు మాట్లాడుతూ 250 టీంలు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ, కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు పని చేస్తున్నాయన్నారు.

# ఢీ అంటే ఢీ

- మొదటి పేజి తరువాయి

ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి.

**ఆందోళన తాత్కాలికమేనా..?**

అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడ్డాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. ‘అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయి’ అని ఆయన పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు.

ఆ విషయం గురించి తరువాత ఆలోచిస్తాం. ఇప్పుడు 50%చెల్లించాల్సిందే.

చైనా, తుర్కియే కూడా రష్యా చమురును కొంటున్నాయి కదా.. మరి ఒక్క భారత్‌నే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు ?

మేం భారత్‌పై సుంకాలను విధించి 8 గంటలే అయింది. కాబట్టి తదుపరి ఏం జరుగుతుందో వేచి చూద్దాం. మున్ముందు మరిన్ని చూస్తారు. ఆంక్షలనూ చూడబోతున్నారు. చైనా, తుర్కియేలపైనా సుంకాలు విధించొచ్చు. మేం ఏం చేస్తామనేది పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

**చైనాపైనా అదనపు సుంకాలను విధిస్తారా ?**

జరగొచ్చు. నాకేమీ తెలియదు. ఇప్పుడేమీ చెప్పలేను. మరో ఇద్దరిపై అదనపు సుంకాలను విధించే అవకాశముంది. అందులో చైనా ఉండొచ్చు.

**భారత్ ఎప్పటికీ రాజీపడదు: మోదీ**

ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా గురువారం దిల్లీలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ‘రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం’ అని ప్రధాని స్పష్టం చేశారు.

**మరిన్ని చూడబోతున్నారు: ట్రంప్**

రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ‘భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారు’ అని పేర్కొన్నారు.

**10 నుంచి 50 శాతం దాకా..**

భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి.

## యువత వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి

- మొదటి పేజి తరువాయి

చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఆయన ప్రకటించారు.

గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, చేనేత కళ మన దేశ సంస్కృతికి, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో చేనేత రంగానికి లబ్ధి చేకూర్చేలా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్ పథకంతో పాటు, చేనేత సొసైటీల నుంచి ఆప్కో కొనుగోలు చేసే వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ రాయితీ ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. దీనితో పాటు, కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు థ్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి అన్ని విధాలుగా ఊతమిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడతామని అన్నారు. రాష్ట్రంలోని యువత వారానికి ఒక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరిస్తే, ఆ రంగంపై ఆధారపడిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగుప డతా యని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసంఘటిత రంగాలలో కీలక ◌ైన చేనేతను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారు... బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడేమయ్యాయి?

- మొదటి పేజి తరువాయి

అని గురువారం ‘ఎక్స్’ వేదికగా విమర్శించారు.

అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. “ట్రంప్ మనపై మరో 25 శాతం సుంకాన్ని విధించారు, దీంతో మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. అంతర్జాతీయ వాణిజ్యం ఎలా పనిచేస్తుందో తెలియని వ్యక్తి మనల్ని బెదిరిస్తున్నారు,” అని ఆయన పేర్కొన్నారు. ఈ సుంకాల వల్ల భారత ఎగుమతిదారులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), తయారీదారులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అంతేకాకుండా, సరఫరా గొలుసులు దెబ్బతిని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గిపోయి, ఉద్యోగాలకు గట్టి దెబ్బ తగులుతుందని ఆయన హెచ్చరించారు. ఈ పరిణామాలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనాన్ని ఒవైసీ తీవ్రంగా ప్రశ్నించారు. “ఈ విషయాలు నరేంద్ర మోదీకి ఎందుకు పట్టడం లేదు? బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడు ఏమయ్యాయి?” అని నిలదీశారు. గతంలో ట్రంప్ 56 శాతం సుంకాలు విధిస్తే మోదీ తన 56 అంగుళాల ఛాతీని చూపిస్తారా అని తాను ప్రశ్నించానని, బహుశా అందుకే ట్రంప్ 50 శాతంతో ఆగిపోయారేమోనని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. “దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని మీ మిత్రులైన బిలియనీర్ల ఖజానాలు నింపడం కోసం తాకట్టు పెట్టారా?” అని ఒవైసీ ప్రశ్నించారు. జూలై 31న కూడా ఇదే అంశంపై స్పందించిన ఒవైసీ, భారత్ ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అమెరికాకు సామంతు రాజ్యం కాదని అన్నారు. జపాన్‌పై 15 శాతం, వియత్నాంపై 20 శాతం, ఇండోనేషియాపై 19 శాతం సుంకాలు విధిస్తూ, భారత్‌పై మాత్రం కక్షపూరితంగా వ్యవహరించడం మన పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### ‘బెంగళూరును పేల్చేయండి ’

సామాజిక మాధ్యమంలో అసీమ్ ఫొటోను ఉంచి, భారత్‌లో ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాలను ఏకీకరణ చేయాలని పోస్టు చేసినట్లు తెలుసుకున్నారు. ఆమెకు సామాజిక మాధ్యమంలో పది వేల మంది ఫాలోయర్లు ఉన్నారని ప్రాథమికంగా గుర్తించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ ప్రతినిధులు గురువారం పేర్కొన్నారు.

## యువత వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేత కార్మికులకు శుభవార్త చెప్పింది. చేనేత రంగానికి అండగా నిలుస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇందులో భాగంగా చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఆయన ప్రకటించారు.గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, చేనేత కళ మన దేశ సంస్కృతికి, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో చేనేత రంగానికి లబ్ధి చేకూర్చేలా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్ పథకంతో పాటు, చేనేత సొసైటీల నుంచి ఆప్కో కొనుగోలు చేసే వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ రాయితీ ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. దీనితో పాటు, కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు థ్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి అన్ని విధాలుగా ఊతమిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడతామని అన్నారు. రాష్ట్రంలోని యువత వారానికి ఒక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరిస్తే, ఆ రంగంపై ఆధారపడిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసంఘటిత రంగాలలో కీలకమైన చేనేతను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## ఈ నెలలో వరుస అల్పపీడనాలు

- మొదటి పేజి తరువాయి

ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో శనివారం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు జోరందుకుంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. రాబోయే రెండు వారాల్లో ఎక్కువ రోజులు వర్షాలు కురిసేందుకు అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది.

**ఈనెల 13 నాటికి..**

రాష్ట్రంలో ఆగస్టు నెల ప్రారంభం నుంచి వేడి, ఉక్కపోత వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రుతుపవనాల కారణంగా మేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో శుక్రవారం నుంచి ఎండ తీవ్రత తగ్గే అవకాశముందని, ఈ సీజన్ చివరి వరకు రుతుపవనాలు చురుగ్గా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వారం రోజులుగా పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో ఈ నెల 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. ఇది పశ్చిమ దిశగా కదులుతుందని అంచనా. తర్వాత వెనువెంటనే అల్పపీడనాలు ఏర్పడతాయని, తుపాన్లుగా బలపడే పరిస్థితులు ఉన్నాయని కొన్ని వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి.

**ఏకధాటి వానలు తక్కువే..**

రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత రాష్ట్రంలో ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ వర్షాలు పడలేదు. జూన్, జులై నెలల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళిక సొసైటీ వెబ్‌సైట్‌లోని వివరాల ప్రకారం జూన్ 1 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సగటున 288.8 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 215.6 మి.మీ. నమోదైంది. ‘ఈ నెలలో విస్తారంగా వర్షాలు కురిసేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. గతంలో మాదిరిగా ఏకధాటిగా వాన కురిసే పరిస్థితులు తక్కువ. సెప్టెంబరు నాటికి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది’ అని ఐఎండీ మాజీ డైరెక్టర్ జనరల్ కేజే రమేశ్ పేర్కొన్నారు.

# సింగరేణి సీపీఆర్వో ఎస్ డి ఎం సుభానికి

- డాక్టర్ సి వి ఎన్ -
- పి ఆర్ ఎస్ ఐ జాతీయ స్థాయి ఉత్తమ పిఆర్ మేనేజర్ పురస్కారం.
- సీఎండీ ఎన్. బలరామ్ అభినందనలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), ఆగస్టు 07,**సింగరేణి సంస్థలో ముఖ్య ప్రజా సంబంధాల అధికారి, జీఎం(కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం సుభాని ప్రతిష్ఠాత్మక డాక్టర్ సి. వి నరసింహారెడ్డి-పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి జాతీయ స్థాయి ఉత్తమ పిఆర్ మేనేజర్-2025 పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ లో బుధవారం సాయంత్రం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ హాల్ లో జరిగిన నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఎడ్యుకేషన్ డే ఉత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ఘంటా చక్రపాణి ఈ అవార్డును ఎస్.డి.ఎం.సుభాని కి ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటల్ మేనేజ్మెంట్ (నిథమ్) డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట రమణ, పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అజిత్ పాఠక్, పబ్లిక్ రిలేషన్స్ వాయిస్ పత్రిక ఎడిటర్ వై బాబ్జి, పిఆర్ఎస్ఐ హైదరాబాద్ ఛాప్టర్ అధ్యక్షులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు. సింగరేణి సంస్థలోని 12 ఏరియాలలో ప్రజా సంబంధాలను పటిష్టంగా నిర్వహిస్తూ, సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ కార్మికులను చైతన్యపరచడంలో, సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావడంలో శ్రీ ఎస్.డి.ఎం సుభాని సీపీఆర్వో హోదాలో తమదైన పాత్రను పోషించారని కొనియాడారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ మాధ్యమాలైన కరపత్రాలు, పోస్టర్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్, వారం వారం సింగరేణి స్రవంతి వంటి అనేక కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తూ ద్విముఖ కమ్యూనికేషన్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు గుర్తింపుగా ఈ అవార్డును సింగరేణి సీపీఆర్వో ఎస్.డి.ఎం సుభానికి బహూకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలో బొగ్గు పరిశ్రమల్లో సింగరేణి సంస్థ ప్రజా సంబంధాలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని, ప్రజా సంబంధాల విభాగంలో గల అన్ని రకాల మాధ్యమాలను సింగరేణి పబ్లిక్ రిలేషన్స్ శాఖ సమర్థంగా వినియోగిస్తూ వస్తోందని నిర్వాహకులు కొనియాడారు. సీఎండీ ఎన్. బలరామ్ అభినందనలు ఎస్ డి ఎం సుభానికి జాతీయ స్థాయి లో ఉత్తమ పిఆర్ మేనేజర్ అవార్డు రావడం పట్ల సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ తన అభినందనలు తెలిపారు. ఇది సింగరేణి లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు కార్మికులకే కాకుండా ప్రజలకు తెలియజేయడంలో సింగరేణి ప్రజా సంబంధాల శాఖ చేస్తున్న కృషికి లభించిన గుర్తింపు అని ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయికి సింగరేణిని తీసుకెళ్లాలన్న లక్ష్యాలకు అనుగుణంగా కార్మికులను సన్నద్ధం చేయడంలో ప్రజా సంబంధాల విభాగం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

## చెట్లు ఉంటే క్షేమం, పచ్చదనంతో రక్షబంధన్



**ఆగస్టు 07 (సీ కే న్యూస్) చేగుంట:** చేగుంట పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్, చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని, విద్యార్థులు ఎంతో ప్రేమతో పెంచుకున్నటువంటి వృక్షాలకు రాఖీ కట్టి, వృక్షాలతో ఉన్నటువంటి అనుబంధాన్ని, ఆప్యాయత, తెలియజేయడం జరిగింది. వృక్షో రక్షతి రక్షితః మనం చెట్లను కాపాడితే అవి మనల్ని కాపాడతాయని మన పెద్దల వాక్కు, మన సంస్కృతి ప్రకృతితో మమేకమైందని. ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జాబ్ మేళాలో 30 మందికి ఉద్యోగాలు.

- జిల్లాలో నిరుద్యోగుల కొరకే ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళా.
- జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),ఆగస్టు 07,**
ఏ యూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు కొత్తగూడెం నందు వివిధ భాగాలలో పనిచేయుటకు మొత్తం 30 ఖాళీలకు గాను ఉద్యోగాలు కల్పించేందుకు ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో 2025 ఆగస్టు ఏడో తారీఖు అనగా గురువారం జాబ్ మేళా ఎంపీడీవో ఆఫీస్ బాబు క్యాంపు కొత్తగూడెం నందు నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు అధిక సంఖ్య లో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాలో 132 మంది ఇంటర్వ్యూలకు హాజరైనారు అధికారులు 80 మందిని వారి వారి క్వాలిఫికేషన్ ను బట్టి అర్హులుగా గుర్తించి వారిలో 30 మంది ని ఎంపిక చేయడం జరిగింది. వీరికి జీతం 16 వేల నుండి మొదలవుతుంది ఇన్సెంటివ్ అలవెన్స్ ఉంటాయిఅని అర్హత సాధించని వారు నిరాశ చెందకుండా మరో జాబ్ మేళాలో వారు అర్హత సాధించాలని కోరిన జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్.

## రాజుపేట గ్రామంలో సింగరేణి ఉచిత వైద్య శిబిరం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఆగస్టు 07,**
సింగరేణి సేవ సమితి మరియు సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పంచాయితీ పరిధిలోని రాజుపేట గ్రామంలో గురువారం సింగరేణి ఉచిత వైద్య శిభిరం నిర్వహించబడినది.

ఈ సందర్భంగా డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం తమ వంతు సామాజిక బాధ్యతగా బొగ్గు గనుల పరిసర ప్రాంతాల గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో భాగంగా రాజుపేట లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో స్త్రీ, పురుషులు, వృద్ధులు, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో విచ్చేసి మొత్తం 74 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిభిరం లో సాధారణ వ్యాధులకు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు బిపి, షుగర్ వ్యాదిగ్రస్తులను పరీక్షించి వారికి కూడా వ్యాధి నియంత్రణ మందులు ఇవ్వడం జరిగింది. మణుగూరు ఏరియా పరిసర ప్రాంత గ్రామస్తులకు అందిస్తున్న ఉచిత వైద్య శిభిరాలను మరింతగా విస్తృత పర్చడం జరిగింది.

ఈ సందర్భంగా ప్రస్తుతం ప్రబల్లుతున్న సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పాటించవలసిన పరిసరాల, గృహ మరియు వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించవలసిన ఆవశ్యకత పై సింగరేణి వైద్యులు రాజుపేట గ్రామస్తులకు అవగాహన కలిపించడం జరిగిందని డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డా. మణి , ఏరియా హాస్పిటల్ స్టాఫ్ నర్స్ రూప శ్రీ, సేవ కో ఆర్డినేటర్ కె. వీ. మారేశ్వర రావు, ఏరియా హాస్పిటల్ సిబ్బంది రాము, రవి, రాజుపేట గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి, నిరు పేదలకు వరం

**ఆగస్టు 07 ( సీ కే న్యూస్) చేగుంట:**చేగుంట పట్టణానికి చెందిన మురాడి సబితకు ముఖ్యమంత్రి సహాయ నిది రిలీస్ ఫండ్ చెక్కును దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు మురాడి సబితకు 31 వేల రూపాయల చెక్కును అందజేసిన చేగుంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి. డిష్ రాజు,సోమ సత్యనారాయణ, అన్నం రవి,కుర్ర లక్ష్మణ్,పులబోయిన రవి, మురాడి సాయి,రవి,తదితరులు పాల్గొన్నారు



## కారుణ్య నియామకాల కొరకు ఏరియా లెవెల్ డిపెండెంట్ కమిటీ సభ్యులతో కౌన్సిలింగ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 07,**కొత్తగూడెం ఏరియా జి.యం. ఎం. షాలేం రాజు ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల కొరకు పద్మావతి ఖని మైన్ మరియు ఏరియా వర్క్ షాప్ నందు విధులు నిర్వహిస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన/ మరణించిన ఉద్యోగుల వారసులు 08 (ఎనిమిది) మందికి పద్మావతి ఖని ఏజెంట్ కార్యాలయంలో ఏరియా లెవెల్ డిపెండెంట్ కమిటీ సభ్యులతో కౌన్సిలింగ్ వారి కుటుంబ సభ్యుల మరియు సాక్షుల సమక్షంలో నిర్వహించి అన్నివివరాలు నమోదు చేసి కౌన్సిలింగ్ పూర్తి అయిన తరువాత అందరిని వైద్యపరీక్షల కొరకు పంపించి కంపెనీ నియమ నిబంధనలు అనుసరించి వారికి నియామక ఉత్తర్వులు అందజేయడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో పద్మావతి ఖని ఏజెంట్ రామ్ భరోస్ మహాతో, డి.జి.యం. (పర్సనల్) గామలపాటి వెంకట మోహన్ రావు, డిజిఎం (ఈ%డ%ఎం), ఏరియా వర్క్ షాప్ టి. శ్రీకాంత్, పద్మావతి ఖని మైన్ మేనేజర్ ఎం.వి.ఎన్. శ్యాంప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్లు మజ్జి మురళి, జి. సంఘమిత్ర, పద్మావతి ఖని సంక్షేమ అధికారి ఎం.డి. షకీల్ సంబంధిత క్లర్క్ అల్లి.విల్సన్, కొత్తపల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర రథసారథి ఎన్ రామచంద్రారావును. సత్కరించిన జిల్లా నాయకులు.

కందుల తానేష్ గౌడ్.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 7.** యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనకు వచ్చిన బిజెపి తెలంగాణ రాష్ట్ర రథసారధి ఎన్ రామచంద్రరావు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి నా జిల్లా నాయకులు కందుల తానేష్ గౌడ్ సంఘం గ్రామం.

ఈ కార్యక్రమంలో వలిగొండ మండల నాయకులు జిల్లా నాయకులు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీసేవ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 07,**
ఇల్లందు పట్టణంలోని మి -సేవ కేంద్రాలలో ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించేందుకు గురువారం అదనపు జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో జిల్లా ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వర రావు , తెలంగాణ గ్రీవెన్స్ అండ్ ట్రాన్సాక్షన్ సిస్టమ్ (టి జి టి ఎస్ ) జిల్లా మేనేజర్ లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రాథమికంగా మి-సేవ కేంద్రాలలో నిర్వహణ, శుభ్రత, సాంకేతిక వసతులు, సిబ్బంది ప్రవర్తన, సేవల వేగం వంటి అంశాలను తనిఖీ చేసారు. కేంద్రానికి వచ్చిన ప్రజలు చేస్తున్న దరఖాస్తులు ం ముఖ్యంగా ఆదాయ ధ్రువపత్రాలు, మౌలిక వృత్తి ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, జనన,మరణ ధ్రువపత్రాలు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులు ం వాటి స్థితిని వివరంగా పరిశీలించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎందుకు ఆ దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి? అని అడిగి తెలుసుకుని, తక్షణమే పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మి-సేవ ఆపరేటర్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రామాణిక ధరల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక రుసుములు వసూలు చేయరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ప్రజలను మోసగించకుండా పారదర్శకతతో పనిచేయాలనీ, ప్రతి వినియోగదారుని పట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు.

అదనపు కలెక్టర్ పర్యటనలో భాగంగా కేంద్రాలలో వున్న సూచిక బోర్డులు, సేవల జాబితా, సేవలకు సంబంధించి రుసుముల వివరాలు స్పష్టంగా ప్రదర్శించబడుతున్నాయా లేదానేది కూడా తనిఖీ చేశారు. ప్రజలకు సేవలపై అవగాహన కల్పించే విధంగా వివిధ సేవలకు సంబంధించిన రుసుముల వివరాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండటం మాత్రమే కాదు, ప్రజలకు అవి వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యంగా అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. దీనిలో భాగంగా మి-సేవ కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తాం అన్నారు. ప్రజల ఫిర్యాదులను జాగ్రత్తగా పరిశీలించి, వేగంగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలి అని తెలిపారు.

## బిజెపి రాష్ట్ర రథసారథి ఎన్ రామచంద్రారావు వెంట పర్యటనలో పాల్గొన్న.

- జిల్లా నాయకులు మంద నరసింహ ముదిరాజ్ సంఘం గ్రామం.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 7.** యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనకు వచ్చిన బిజెపి తెలంగాణ రాష్ట్ర రథసారధి రామచంద్రారావు వెంట పర్యటనలో పాల్గొన్న బిజెపి జిల్లా నాయకులు మంద నరసింహ ముదిరాజ్ సంఘం గ్రామం.

రాష్ట్ర రథసారథి ఎన్ రామచంద్రరావు ను మర్యాదపూర్వకంగా కలుసుకొని చాలువతో సన్మానం చేసినారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు జిల్లా నాయకులు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 35 వ వార్డ్ లో కార్పొరేటర్ విల్లూరి భాస్కర్ రావు పర్యటన

**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఆగస్టు 07:** ఈరోజు విశాఖ దక్షిణ నియోజకవర్గం 35 వ వార్డ్ ప్రాంతంలో ఈరోజు విశాఖ దక్షిణ నియోజకవర్గం 35 వ వార్డు కార్పొరేటర్ విల్లురి భాస్కరరావు జీవీఎంసీ మాజీ స్టాండింగ్ కమిటీ మెంబర్ వార్డు పర్యటించగా స్థానిక ప్రజలని సమస్యలనీ అడిగి తెలుసుకోవడం జరిగినది డ్రింకింగ్ వాటర్ యూజీడీ అండర్ గ్రౌండ్లో పలు ఇబ్బందులపై మాట్లాడి కన్సన్ జీవీఎంసీ ఏఈ ని రప్పించి మరియు జీవీఎంసీ సిబ్బంది వర్క్ ఇన్స్పెక్టర్స్ తో కలిపి సమస్యను శాశ్వత పరిష్కారం చేసే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. కార్యక్రమంలో 35 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుచా రామిరెడ్డి మరియు మహిళా నాయకురాలు తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు కంటిపిల్లి వరలక్ష్మి మహిళ తెలుగుదేశం పార్టీ నాయకులు నాయకురాలు పార్టీ శ్రేణులు పాల్గొనడం జరిగింది.



# పోరాట యోధుడు అయోధ్యకు అంతిమ వీడ్కోలు.

-జనసంద్రమైన రామానుజవరం.
- కదిలిన పల్లెలు, బరువువెక్కిన గుండెలు.
- నివాళ్లర్పించిన సిపిఐ నేతలు.
-కంటతడిపెట్టిన చాడా, కూనంనేని, సాబీర్ పాషా.
- చిత్రపటానికి పాలాభిషేకం.
- వేలాదిమందితో అంతిమయాత్ర.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / మణుగూరు ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 07,** కమ్యూనిస్టు పోరాట యోధుడు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య అంతిమ వీడ్కోలు గురువారం అశృనయాల నడుమ సాగింది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివ రావు, జిల్లా కార్యదర్శి ఎస్కె
సాబీర్ పాషాలు అయోధ్య భౌతికకాయంపై ఎర్రజెండాను కప్పి పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. సూర్యపేటలో బుధవారం వేకువ జామున ప్రమాదానికి గురై తుదిశ్వాస విడిచిన ఆయనను ముందుగా ఖమ్మం జిల్లా సిపిఐ కార్యాలయాని కి, ఆతర్వాత కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యాలయానికి, అటు నుండి నేరుగా మణుగూరు సిపిఐ కార్యాలయానికి తరలించిన విషయం విధితమే. ఆయన మృత దేహాన్ని సందర్శనార్ధం ఉంచి అక్కడ్నుంచి రాత్రి 10 గం.లకు అయోధ్య స్వగ్రామమైన రామానుజవరంకు చేర్చారు. గురువారం అశృనయాల నుడమ బరువెక్కిన గుండెలు, కన్నీటిధారలతో అంత్యక్రియలు జరిగాయి.
జనసంద్రమైన రామానుజవరం ///- అయోధ్య స్వగ్రామమైన రామానుజవరం జనసంద్రమైంది. తన
అభిమాన నాయకున్ని చివరి చూపు చూసేందుకు వేలాదిగా జనం తరలివచ్చారు. ఆయోధ్య మృతదేహంపై ఎర్రజెండా, పూల మాలలు వేసి ప్రియనేతకు కన్నీటి నివాళ్లు అర్పించారు. రాష్ట్రంతోపాటు జిల్లా నలు మూలల నుండే కాకుండా ఆయనకు సుపరిచితులు సైతం అయోధ్యను కడసారి చూసేందుకు బారులుతీరారు. అయనతో పాటు ఇంతకాలం కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగిన వారు, సమకాలీకులు జోహార్ అయ్యో అంటూ నినాదాలు చేస్తూ కన్నీటి పర్యంత మయ్యారు. ప్రధానంగా పినపాక
నియోజవర్గవ్యాప్తంగా పల్లెలు అయోధ్య వద్దకు కదిలాయి. తాము ఇప్పుడు ఆయా గ్రామాల్లో
ఉంటున్నామంటే సిపిఐ పోరాటాల ఫలితమే అని గుర్తు చేసుకుంటూ పార్ధీవ దేహాన్ని చూసి బోరున
విలపించారు. పలువురి నివాళ్లు ///- సిపిఐ నేత అయోధ్యకు సిపిఐ జాతీయకార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, ఆంధ్రప్రదేష్ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునీర్ తో పాటు భద్రాచలం ఎంఎల్ఎ డా. తెల్లం వెంకట్రావు, పినపాక మాజీ ఎంఎల్ఎస్ఐ రేగా కాంతారావు, సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, జిల్లా
కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, కాంగ్రెస్, బిఆర్ఎస్, టిడిపి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, సిపిఐ అనుబంధ మహిళా సంఘం, ఏఐటియూసి అనుబంధ సంఘాలైన హమాలీ, బొగ్గుముఠా సంఘం, సింగరేణి లారీ యూనియన్ నాయకులు, గిరిజన సంఘాలతో పాటు పలువురు ఘన నివాళ్లర్పించారు. కంటతడి పెట్టిన నేతలు ///- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మృతదేహాన్ని చూసి సిపిఐ
నేతలతో పాటు పలువురు కంటతడిపెట్టారు. ప్రధానంగా సిపిఐ నేతలు చాడా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, సాబీర్ పాషాలు వారితో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకుంటూ ఒక్క సారిగా భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. అదే విధంగా ఆయనతో గతంలో కలిసి పనిచేసి వివిధ పార్టీల్లో ఉన్న నాయకులు సైతం అయోధ్యతో ఉన్న సంత్సంబంధాలను గుర్తు చేసుకున్నారు. ఏదైనా ప్రజా సమస్యపై పోరాటాన్ని మొదలుపెడితే ఆ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు వదిలి పెట్టేవారు కాదని, ఆ సమస్య కోసం ఎందాకైన తెగించి పోరాటం చేసేవారని, ఆయన లేని లోటు ఎవ్వరూ తీర్చలేరని, కమ్యూనిస్టు పార్టీ
మంచి పోరాట యోధున్ని, ఉధ్యమ కెరటాన్ని కోల్పోయిందన్నారు. వేలాది మందితో అంతిమయాత్ర ///- సిపిఐ నేత బొల్లోజు అయోధ్య అంతిమ యాత్ర వేలాది మందితో సాగింది. సుమారు నాలుగు కిలోమీటర్ల దారిపోవడునా జనం కన్నీటి నిరాజనాలు అర్పించారు. ఈ సందర్భంగా అంతిమయాత్రలో అయోధ్య చిత్రపటానికి యువత పాలాభిషేకం చేశారు. డప్పు వాయిధ్యాలు, ఎర్రజెండాలు, విప్లవగీతాలు, జన జోహార్లతో అంతిమయాత్ర రహదారి మార్మోగింది.
ఏటూరునాగారం-మణుగూరు ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 40 ఏళ్లపాటు అనేక నిర్బంధాలను ఎదుర్కొని, అనేక ఆటుపోట్ల నడుమ ఈ ప్రాంతంలో బలమైన ఉధ్యమాని నిర్మించిన సిపిఐ నిబంధత గల నేత బొల్లోజు అయోధ్య లేదని నిజాన్ని ఇక్కడి జనం నమ్మలేకుండా ఉన్నారు. మొన్నరాత్రే ఆయనతో చాలా విషయాలు చర్చించామంటూ కొందరు, రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విధివిధాలకు కట్టుబడి పనిచేయాలంటూ దిశా నిర్ధేశం చేశారని సహచరులు చెప్పుకుంటూ కంటపడిపెట్టారు. గతంలో పలుమార్లు ప్రమాదానికి గురై మృత్యుజయుడైన అయోధ్య సూర్యాపేట ప్రధాన రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో విగత జీవిగా మారారు. అయోధ్య మరణ ఈ ప్రాంత ఉధ్యమానికి తీరనిలోటని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని, అదే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అంటూ నేతలు పిలుపునిచ్చారు.

## గిరిజన జర్నలిస్టులను ఆదుకోవాలి : టి టి డబ్ల్యూ జె ఏ అధ్యక్షులు తిరుపతి నాయక్



**సి కె న్యూస్ ప్రతినిధి:**గిరిజన జర్నలిస్టులను ప్రభుత్వం, తెలంగాణ ప్రెస్ అకాడమీ ద్వారా ఆదుకోవాలని తెలంగాణ ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతి నాయక్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం వేల మంది గిరిజన యువకులు వివిధ పత్రికల్లో, టీవీ ఛానల్ లో జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రభుత్వం నుండి అందవలసిన కనీస గుర్తింపు సహకారం వారికి లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా గత మూడు దశాబ్దాలుగా వివిధ ప్రముఖ ఛానల్లో పనిచేసిన సీనియర్ పాత్రికేయులు చందు విధినిర్వాహణలో భాగంగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ప్రెస్ అకాడమీ నుండి కనీస సహాయం అందలేదని అన్నారు. గత ఆరు నెలలుగా ఇంటికే పరిమితమైన చందుకు ఈరోజు తెలంగాణ ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ తరపున రూ. 20 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి నాయక్ మాట్లాడుతూ .. చందు కు ఆర్థిక సహాయం కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రస్ కాడమీను పలుమార్లు విజ్ఞప్తి చేశామని తెలిపారు. అయినా ప్రెస్ అకాడమీ నుండి సరైన స్పందన లేకపోవడంతో తమ సంఘం తరపున ఆర్థిక సహాయం చేసినట్లు ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని అన్నారు. రాష్ట్రంలో గిరిజన జర్నలిస్టుల సమస్యలపై తెలంగాణ ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ నిరంతరం పోరాటం చేస్తుందని ప్రకటించారు. కొంతమంది గిరిజన జర్నలిస్ట్ పేర్లు చెప్పుకొని తమ స్వప్రయోజనాల కోసం పని చేస్తున్నారని అటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ ట్రైబల్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర నాయకులు డా. వెంకట్, వినోద్, అశోక్, రాధా కృష్ణ ,లాలు,నరేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.
మహబూబాబాద్ తెలంగాణ ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడి నీ పరామర్శించిన రాష్ట్ర నాయకులు
మహబూబాబాద్ తెలంగాణ ట్రైబల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లావుడియా మనోహర్ తల్లి స్వర్గస్తులై పెద్దకర్మ సందర్భంగా.. తెలంగాణ ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ తిరుపతి నాయక్, రాష్ట్ర నాయకులు డాక్టర్ వెంకట్, చందు , వినోద్ పాటు పలువురు జర్నలిస్ట్ లు మనోహర్ ను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా మనోహర్ కు అసోసియేషన్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు.

## రాజ్యాంగం కల్పించిన హక్కుల పై అవగాహన కలిగి ఉండాలి

- జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి.



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, (వెంకటేష్)ఆగస్టు 07,**గిరిజన హక్కుల దినోత్సవాన్ని పునస్కరించుకొని గురువారం ఇల్లందు కోర్టు ఆవరణం నందు ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ పౌరులు తమ హక్కులను గురించి తెలుసుకోవడం వలన పని చేసే చోట వివక్షకు,ఆర్థిక అసమానతలకు గురికాకుండా ప్రశ్నించే తత్వం వస్తుందని,ముఖ్యంగా మహిళలు శారీరకంగా, లైంగికంగా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని,ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలను చదివించే ఆర్థిక స్తోమత లేని కారణంగా విద్యా భవిష్యత్తు మధ్యలోనే ఆగి పోవాల్సి వస్తుందని, వసతి గృహాల్లో ఉండే బాల బాలికలు సరియైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మా దృష్టికి వచ్చిందని సందర్భంగా వారు తెలిపారు. ఆర్థిక స్తోమత లేని కక్షిదారులకు కోర్టు ద్వారా ఉచిత న్యాయవాదిని నియమిస్తామని, మీరు కూడా మీ చుట్టూ పక్కల ప్రాంతాల్లో జరిగే అన్యాయాల, అక్రమాలపై, వసతి గృహాల వసతులపై మీ దృష్టికి వచ్చిన సమస్యలపై మాకు లేఖ ద్వారా సమాచారం అందించినట్లయితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపినారు, అనంతరం కక్షిదారులకు జడ్జి చేతుల మీదుగా మొక్కల పంపిణీ చేసినారు, అందరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించవలసిందిగా వారు కోరినారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాంపల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు ఎస్. వెంకటనరసయ్య కె.నారాయణ, ఎస్. వెంకటేశ్వర్లు, కోర్టు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

సిడిపిఓ నిర్మల జ్యోతి



**తల్లాడ, ఆగస్టు7 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్)** మండల పరిధి అన్నారుగూడెం సెక్టర్ లెవెల్ లో
మల్లవరం గ్రామ పంచాయతీ రైతు వేదికలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి ప్రాజెక్టు అధికారి సి డి పి ఓ నిర్మల జ్యోతి హాజరైనారు. సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ
బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించాలని,కాన్పు జరిగిన వెంటనే సాధ్యమైనంత త్వరగా బిడ్డకు పాలు పట్టించాలని తెలిపారు.
ఈ ముర్రుపాలు తాగటం వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని జీవితాంతం అనారోగ్య సమస్యలు రావని తెలియచేసారు.తల్లులకు బాలింతలకు గర్భిణీలకు అక్షరాభ్యాసం శ్రీమంతాలు నిర్వహించారు. తల్లిపాలు బిడ్డలకు ఆరు నెలలు పాటు ఇవ్వాలని చిన్నపిల్లల తో పాటు తల్లులు సరైన సమయంలో టీకా లు తీసుకోవాలని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు
ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి సిద్దికే మియా, సూపర్వైజర్ సత్యవతి, తల్లాడ సర్కిల్ సూపర్వైజర్ రోజా కుమారి,
అంగన్వాడి టీచర్ లు మరియు వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు బాలింతలు గర్భిణీ స్త్రీలు, గ్రామం ప్రజలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అడవి బిడ్డలకు భోజనాలు కూరలు వితరణ..



**తల్లాడ ఆగస్టు 7 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:**తల్లాడ పట్టణ ప్రాంతానికి చెందిన శోభనాద్రిశ్వ రాజు 11వ రోజు సందర్భంగా కుటుంబ సభ్యులు ఏన్కూర్ మండల%శీ%,,కొత్త మేడే పల్లి,, గ్రామ కోయ అడవి బిడ్డలకు, భోజనం, సాంబారు,కేసరి,పచ్చళ్ళు, పప్పు,మిఠాయిలు, పలు రకాల తిను బండారాలు యన్ జీ ఓ శ్రీనివాస్ కీ అందించి ఔదార్యం చాటుకున్నారు.. ఈ కార్యక్రమంలో ఈధర రామ కృష్ణ కుమారి,శివ శంకర్ రాజు,నాగ లక్ష్మి, త్రిపుర సుందరి,ధాత్రి దేవీ, శేష రత్నం,రాజా శేఖర్ వర్మా, లక్ష్మయ్య, మా రత్నమ్మ స్వచ్ఛ%శీ%ద సేవా సొసైటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు..

## మునగ సాగు ద్వారా ఆదాయవృద్ధికి మోడల్ గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

- ఉదాహరణగా మైలారం రైతు జమీల్ సక్సెస్ స్టోరీను వివరించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్.
- అభినందించిన కేంద్రస్థాయి అధికారులు..




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 07,**ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో గురువారం నిర్వహించిన "ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ %డ% బ్లాక్స్"పై జాతీయ స్థాయి సెమినార్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగుతున్న మునగ (మోరింగా) సాగు గురించి వివరించారు.
భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణలో అతిపెద్ద జిల్లా కాగా, 50% కంటే ఎక్కువ భాగం అడవులతో కప్పబడినది. సుమారు 37% జనాభా గిరిజన సమాజానికి చెందినది. భౌగోళికంగా కలిపి ఉన్న భూములు, సమృద్ధిగా వర్షపాతం ఉన్నా, సాగు నీరు అందుబాటు తక్కువగా ఉంది. రైతులు ముఖ్యంగా పత్తి, మొక్క జొన్న వంటి పంటలు సాగు చేస్తూ తక్కువ ఆదాయం పొందుతున్నారు. పత్తిలో ఎకరాకు సగటున రూ.15,000 మరియు మక్కలో రూ.30,000 మాత్రమే లాభం వస్తోంది.
ఈ నేపథ్యంలో రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం మునగ సాగును ప్రోత్సహించడం ప్రారంభించింది. టీఎన్ఏయూ (కోయంబత్తూర్) మరియు స్థానిక వ్యవసాయ కళాశాల (అశ్వారావు పేట) నిపుణులతో సంప్రదించి, కర పత్రాల (పాంప్లేట్స్ ) ద్వారా రైతులకు సమాచారం అందించేయడంతో ఎన్ ఆర్ ఈ జీ ఎస్ వంటి పథకాల సహాయంతో చిన్న, సన్నకారు రైతులు ఖర్చు లేకుండానే మునగ సాగు ప్రారంభించగలుగుతున్నారు.
మునగ సాగు ఆదాయ విశ్లేషన
ఒక ఎకరాలో సుమారు 1000 మొక్కలు ఉంటాయి. కనీసం ఒక్కో మొక్కకు 100 కాయలు వచ్చినా, వాటిని రూ.2 ధరకు విక్రయిస్తే రూ.2 లక్షల ఆదాయం పొందవచ్చు. ఆకుల విక్రయంతో అదనంగా రూ.20,000 లాభం వస్తోంది.
ఈ ఆదాయంతో రైతులు కూరగాయల సాగు, నాటు కోడి పెంపకం, చేపల చెరువులు వంటి అనుబంధ కార్యకలాపాలను చేపడుతూ ఏకీకృత వ్యవసాయ విధానానికి మారుతున్నారని పేర్కొన్నారు.
జిల్లాలో ఇప్పటివరకు సుమారు 415 ఎకరాల్లో మునగ సాగు ప్రారంభమైందని, ఇందులో 100 ఎకరాల్లో మునగను ప్రధాన పంటగా, 300 ఎకరాల్లో అంతర పంటగా సాగుచేస్తున్నారని పేర్కొన్నారు
ఈ సందర్భంగా మైలారం గ్రామానికి చెందిన రైతు జమీల్ కథను కలెక్టర్ ఉదాహరణగా వివరించారు: "మునగ ఆకులతో కోళ్లకు మేత వేసి అదనపు ఆదాయం పొందారు. ప్రస్తుతం ఆయన క్వయిల్ (కౌంజు పిట్టలు) యూనిట్ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు" అని పేర్కొన్నారు.
ఈ ప్రాక్టీస్‌లో ప్రధానంగా రైతుల అనుమానాలను తొలగించి, భయాలను నివారించడం, గ్రామీణ స్థాయిలో విజేతల అనుభవాలు పంచుకోవడం వంటి అంశాలు, రైతులను ప్రయోగాత్మకంగా ముందడుగు వేయించేలా చేశాయని కలెక్టర్ వివరించారు.
ఈ సెమినార్‌లో పాల్గొన్న కేంద్ర స్థాయి అధికారులు మరియు ఇతర జిల్లాల కలెక్టర్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అమలవుతున్న మునగ సాగు కార్యక్రమాన్ని అభినందించారు.

## గుడుంబా స్థావరాలపై సరిహద్దుల్లో దాడులు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 07,**బూర్గంపహాడ్ మండల కేంద్రంలో తెలంగాణ,ఆంధ్రా రాష్ట్రల సరిహద్దు ప్రాంతం అయిన కిన్నెరసాని, దోమలవాగు సమీపంలో గుడుంబా తయారి స్థావరాల పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పలువురు సీ ఐ లు వారి బృందాలతో సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో పానకం డ్రంబులు సారా తయారీ సామాగ్రి ధ్వంసం చేశారు. రైతు పంట పొలాలు ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో గుడుంబా తయారీ అమ్మకాల పై ప్రత్యేక దృషి సారిస్తాం అని, తెలంగాణ అధికారుల తో కలిసి సంయుక్త దాడులు నిర్వహిస్తాం అని,ప్రజలు ఎవరు హానికర గుడుంబా సేవించవద్దు అని, సరిహద్దు ప్రాంతాల్లో తరచూ దాడులు నిర్వహిస్తాం అని జంగారెడ్డిగూడెం ఎక్సైంజ్ సీ ఐ కె. శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఏలూరు ఎన్ఫోర్స్మెంట్ సీఐ ఫణికుమార్, ఈఎస్ టాస్కోర్స్ సిఐ ఆర్ సత్యవతి తో పాటు పలువురు ఎస్ఐ లు వారి సిబ్బంది, కుక్కునూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.౦

## దశదినకర్మకు హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్



**తల్లాడ ఆగస్టు 7 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**
తల్లాడ మండలం నూతనకల్లు గ్రామానికి చెందిన కళ్యాణపు శ్రీనివాసరావు ఇటీవల మరణించారు. గురువారం నూతనకల్ గ్రామంలో దశదినకర్మ నిర్వహించారు కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద హాజరై శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అడపా అనిల్ చౌదరి, గణేశుల రవి. తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మండలంలో పలు కుటుంబాలను పరామర్శించిన తల్లాడ మాజీ ఎంపీపీ ...



**తల్లాడ ఆగస్ట్ 07, సీకే న్యూస్ ప్రతినిధి విజయ్ ....**తల్లాడ మండలంలో మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు గురువారం పలు కుటుంబాలను పరామర్శించారు.

**నూతనకల్ గ్రామంలో ...**

నూతనకల్ గ్రామానికి చెందిన కళ్యాణపు శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మరణించగా గురువారం ఆయన దశదిన కార్యక్రమం స్థానికంగా వారి గృహంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు.

**బాలపేట గ్రామంలో ...**

బాలపేట గ్రామంలో ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్ పూర్ణకంటి వెంకటేశ్వరరావు తండ్రి పూర్ణకంటి రాములు ఇటీవల హార్ట్ స్ట్రోక్ తో మరణించారు. గురువారం ఆయన దశదిన కార్యక్రమం బాలపేట గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు.

ఈ కార్యక్రమాలలో బిఆర్ ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు వీర మోహన రెడ్డి,నూతనకల్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు,బాలపేట గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు,ఆ పార్టీ తల్లాడ టౌన్ అధ్యక్షులు జి.వి.ఆర్,ఆ పార్టీ సీనియర్ నాయకులు మువ్వ మురళీధర్ రావు,కేతినేని చలపతిరావు,నాయుడు శ్రీనివాసరావు,జర్నలిస్టులు షేక్ రోబో,మోదుగు జయరాజు,గొడ్ల శ్రీనివాసరావు,అద్దంకి సురేష్,మేడి ఇశ్రాయేలు, మేడి బసవయ్య,అద్దంకి ప్రసాద్,నాయకులు గొడ్ల ప్రభాకర్,ఇస్నపల్లి శ్రీనివాసరావు,మాజీ వార్డ్ మెంబర్ గొడ్ల వెంకటేష్, వీరయ్య తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇంటికి అడ్డంకిగా విద్యుత్ వైర్లు..

- నిర్మించుకునేందుకు వెనకాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు.



**ఖమ్మం/ తల్లాడ/ ఆగస్టు/7 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:**విద్యుత్ వైర్లు ఇంటిపైన వేలాడుతుండటంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు బాధిత కుటుంబ సభ్యులు వెనకాడుతున్న ఘటన తల్లాడ మండలంలో నెలకొంది. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సంఘసాని శిరీష కు ఇందిరమ్మ ఇల్లు మంజూరయింది. ఈ నేపథ్యంలో తమకున్న సొంత భూమిలో ఇంటిని నిర్మించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇంటి నిర్మాణంలో భాగంగా పిల్లర్లకు సంబంధించిన ఇనుప కడ్డీ సువ్వలు నిలబెట్టి బేస్ మట్టం వరకు పూర్తి చేశారు. దీంతో పిల్లర్లకు సంబంధించిన ఇనుప కడ్డీ సువ్వలు పైన విద్యుత్ వైర్లు ఉండటంతో వాటికి అంటుకునే ప్రమాదం నెలకొంది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులు ఆ ఇంటిని నిర్మించుకునేందుకు వెనకాడుతున్నారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు విద్యుత్ వైర్లను జరపాలని వేడుకుంటున్నారు.

**గతంలో విద్యుత్ ఘాతంతో కుమారున్ని కోల్పోయాం..**

గతంలో మా కుమారుడు విద్యుత్ ఘాతంతోనే మృతి చెందాడని బాధిత కుటుంబ సభ్యులు సంఘసాని మల్లిక తెలిపారు. వేరే గ్రామంలో విద్యుత్ పనులు చేస్తుండగా అకస్మాత్తుగా తన కుమారుడు విద్యుత్ షాక్ తో మృతి చెందాడని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని, ఆ ఇల్లు నిర్మించుకుందామని పనులు చేస్తుంటే విద్యుత్ వైర్లు అడ్డువస్తున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు ఉండటం వల్ల ఇంటి నిర్మాణ పనులను నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.

**విద్యుత్ అధికారులు దృష్టి సారించాలి..**

విద్యుత్ అధికారులు దృష్టి సారించి విద్యుత్ వైర్లను తమ ఇంటి పైనుండి జరపాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. విద్యుత్ అధికారులకు ఈ విషయాన్ని తెలియజేశామని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు జరిపే స్థోమత తమ వద్ద లేదని, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి విద్యుత్ వైర్లను జరపాలని వారు ముక్తకంఠంతో కోరుకున్నారు.ఁ

# ఆగస్టు 15 నాటికి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారానికి కృషి....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సాదా బైనామా దరఖాస్తులకు నోటీసులు జారీ చేయాలి
- ప్రతి మండలంలో 10 శాతం దరఖాస్తులను ర్యాండంగా చెక్ చేస్తాం
- కలెక్టరేట్ నుంచి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారంపై మండల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -07:**

ఆగస్టు 15 నాటికి రెవెన్యూ సదస్సుల క్రింద వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి గురువారం రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్షించారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులు, ఎన్ని దరఖాస్తుల పరిశీలన జరిగింది, ఆగస్టు 15 నాటికి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి 75 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిలో సాదా బైనామా కు సంబంధించి ఉన్న 49 వేల దరఖాస్తులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని అన్నారు.

సాదా బైనామా మినహాయించి పెండింగ్ ఉన్న దరఖాస్తులను మండలాల వారీగా ప్రస్తుత స్థితిగతులపై నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తు సంబంధించి నోటీసుల జారీ పూర్తి చేయాలని, రోజూ మండల స్థాయిలో కొన్ని దరఖాస్తుల పరిష్కారం పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారం చేయడంలో మంచి పురోగతి సాధించాలని అన్నారు.

భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను తిరస్కరించే నేపథ్యంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తులను వేగంగా పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో ఎక్కడా తప్పులు జరగడానికి వీలు లేదని అన్నారు. ప్రతి మండలంలో 10 శాతం దరఖాస్తులను జిల్లా స్థాయిలో ర్యాండమ్ గా చెక్ చేయడం జరుగుతుందని, భూ భారతి చట్టం నిబంధనలు పాటించని పక్షంలో చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

భూ భారతి దరఖాస్తులు పరిష్కారం అయ్యే వరకు రెవెన్యూ సిబ్బంది సెలవులు తీసుకోరాదని, ప్రతిరోజు రెవెన్యూ సదస్సులు దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి ఉండాలని, ఈ వివరాలు రోజు నోటిపై చేసిన నమునాలో రిపోర్ట్ చేయాలని అన్నారు.

డివిజన్ పరిధిలో వెనకబడిన మండలాలపై రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రోజు మండల తహసిల్దార్ లతో సమీక్షించుకుంటూ రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి ఉండేలా చూడాలని అన్నారు.

సాదా బైనామా దరఖాస్తులలో ముందు నోటీసులు జారీ చేయాలని, అనంతరం నిబంధనల ప్రకారం భూ భారతి చట్టం, సాదా బైనామా గైడ్ లైన్స్ ప్రకారం అర్హత ఉన్న దరఖాస్తులు పక్కన పెట్టుకోవాలని, హై కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి ఆస్కారం ఉంటుందని అన్నారు.

అంతకుముందు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తహసీల్దార్లతో సమీక్షిస్తూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు, డిప్యూటీ సీఎం ల సమయం తీసుకొని పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయింపు చేయాలని అన్నారు.

వివిధ దశలలో పురోగతిలో ఉన్న 655 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఏన్కూరు లో 40 ఇండ్లను లబ్ధిదారులు ఆక్రమించారని, దీనిపై నివేదిక అందించాలని తహసిల్దార్ ను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఇండిపెండెంట్ గా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు ఇందిరమ్మ ఇండ్ల తరహాలో లబ్దిదారుల ద్వారా పూర్తి చేయాలని, ఆసక్తి అర్హత గల లబ్ధిదారులను వారం రోజులలో ఎంపిక చేయాలని ఆదేశించారు.

ఈ వీడియో సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, జిల్లాలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిజాలు, రాస్తే పత్రికలపై ..నీందేలా ...?









- పత్రికలను, పాత్రికేయులనే బ్లాక్ మెయిల్ చేస్తున్న వైనం
- అంగన్వాడి సెంటర్లను వదిలి సూపర్వైజర్ భజన
- ఆగస్టు1న బదిలీ అయిన సూపర్వైజర్ సుధా
- సూపర్వైజర్ కొరకు ఆర్భాటంలో ఆంతర్యం ఏంటి...?

**సీకే న్యూస్,దంతాలపల్లి.** దంతాలపల్లి మండల పెద్దముప్పారం సెక్టార్లకు సూపర్వైజర్ గా పనిచేసిన సుధా అంగన్వాడి సిబ్బందిని పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేసి ఆత్మహత్యలే శరణ్యం అనే పరిస్థితికి తీసుకురావడంతో పత్రికా విలేకరులకు తెలియజేయడంతో పలు పత్రికలు పలు కథనాలు రాయడం తో జిల్లా అధికారులు బి డబ్ల్యూ శిరీష ఆదేశాల మేరకు సిడిపిఓ ఎల్లమ్మ తనిఖీ నిర్వహించి పలువురు ఆమె వల్ల మనిషి వక్షోభ గురయ్యామని మాకు ఆమె వల్ల ఆత్మహత్య శరణ్యమని ఆమె ఉంటే మాకు చావులే తప్ప మరేది లేదు అని మాకొద్దు సూపర్వైజర్ అని రాతపూర్వకంగా రాసి ఇవ్వడంతో ఈనెల 1వ తేదీన అధికారులు ఆమెను బదిలీ చేస్తున్నట్లు ఆర్డర్ ను ఇష్యూ చేయడం జరిగింది . ఇది జరిగినా కూడా సూపర్వైజర్స్ సుధా ఎత్తుగడలు రాజకీయాలు చేస్తూ కొంతమంది టీచర్లను అంగన్వాడి సెంటర్లను ఆయాలకు వదిలిపెట్టి రెండు మూడు రోజుల నుండి కలెక్టర్ డీ డబ్ల్యూ సిడిపిఓ ఆఫీస్ లో చుట్టూ తిప్పుతూ నన్నే ఉంచేలా చేయాలని వారితో మీటింగ్లు పెడుతూ రాజకీయం చేస్తున్నది, అంగన్వాడి సెంటర్లలో పిల్లలను ఆయాలకు వదిలేసి సూపర్వైజర్ భజన చేస్తూ ప్రెస్ మీట్ లో పాల్గొంటూ బదిలీ అయిన సూపర్వైజర్ కు ఉత్తసు పలుకుతూ అంగన్వాడి టీచర్ల పైన తక్షణమే ఉన్నది చర్య తీసుకోవాలని ఆయా సెంటర్లను తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు, కొంతమంది టీచర్లకు ఇష్టానుసారంగా సెలవులు ఇచ్చి వాళ్ళని తొత్తులుగా ఉంచుకొని ఆమె ఇష్టానుసారంగా ఉద్యోగం నిర్వహించిన సూపర్వైజర్ కు వంత పాడుతున్న కొంతమంది టీచర్ల నిజాలు

నిజాలు రాసిన పత్రికలపైనే ఫిర్యాదులు చేయించి పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు ఇలా చేస్తే పత్రికలు ప్రజలు ప్రజాస్వామికవాదులు సమాజము సహించదని తెలియవస్తుంది, ఆగస్టు ఒకటో తేదీన బదిలీ అయిన సూపర్వైజర్ సుధా కు దంతాలపల్లి మండలం లో ఏం పని అత్యవసర సమావేశాలకు కారణమేంటి... అంగన్వాడి సెంటర్ ను వదిలి సూపర్వైజర్ భజన చేపిస్తూ తిప్పడానికి కారణం ఏంటి ఎన్ని రోజుల నుంచి ఎంతమంది టీచర్లు అంగన్వాడి సెంటర్ లను వదిలారు సమగ్ర విచారణ జరిపించి వారిపై చర్య తీసుకోవాలని కోరుతున్న మండల ప్రజలు

# జల్ జీవన్ మిషన్ స్కీం పర్యవేక్షణ పట్ల శ్రద్ధ వహించాలి

- కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్
- దిశ సమావేశాలు రెగ్యులర్ గా నిర్వహించాలి
- జల్ జీవన్ మిషన్ పై తెలంగాణ, ఝార?ండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -07:** జల్ జీవన్ మిషన్ పథకం క్రింద సృష్టించిన మౌళిక వసతుల కల్పన పనుల పురోగతి నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ అన్నారు.

జల్ జీవన్ మిషన్ పై తెలంగాణ, ఝార?ండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ పథకాలను పర్యవేక్షించేందుకు డాష్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి సంబంధించిన లాగిన్ వివరాలను జిల్లా కలెక్టర్లు తీసుకుని వారి పరిధిలోని పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు.

దిశ సమావేశాలు రెగ్యులర్ గా నిర్వహించి జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ పై సమీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశాల మినెట్స్ కాపీలను ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. త్రాగునీటి సరఫరా సోర్స్ బలోపేతం, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు త్రాగు నీటి సరఫరా వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈఓ, ఈఈ మిషన్ భగీరథ లాగిన్ క్రియేట్ చేయడం జరిగిందని, గతి శక్తి క్రింద 2,571 కి.మీ. పనులు పూర్తి చేశామని అన్నారు. దిశ సమావేశాలు రెగ్యులర్ గా జరుగుతున్నాయని అన్నారు. త్రాగు నీటి బల్క్ సరఫరా పనులు పూర్తి అయ్యాయని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో త్రాగు నీటి సరఫరా పనులు కాకపోతే కొత్తగా మంజూరు చేసేందుకు అవకాశం పరిశీలించాలని అన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రాల్లో త్రాగునీటికి సంబంధించి ఎటువంటి పెండింగ్ పనులు ఉన్నా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఇ శేఖర్ రెడ్డి, ఇఇ పుష్పలత, వాణిశ్రీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 'వర్మ' తీరు.. న్యాయ వ్యవస్థపై క్షిపణి ప్రయోగం లాంటిది!



అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తీరుపై సుప్రీంకోర్టు.. తీవ్ర సంచలన వ్యాఖ్యలు చేసింది. %---%వర్మ%-% తీరు.. న్యాయ వ్యవస్థపై క్షిపణి ప్రయోగం లాంటిది%--% అని పేర్కొంది. ఆయన వేసిన పిటిషన్‌ను కూడా కొట్టి వేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తుల వ్యవహార శైలి.. సుప్రీంకోర్టును, భారత పవిత్ర న్యాయవ్యవస్థను కూడా ప్రశ్నించేలా ఉందని.. దీనిని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదని కూడా సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ క్రమంలో ఆయనను పదవి నుంచి తప్పించడం తప్ప.. మరో మార్గం లేదని పేర్కొంది.

**ఎవరు? ఏంటి?**

జస్టిస్ యశ్వంత్ వర్మ.. ఈ ఏడాది జనవరిలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా.. పదోన్నతి పొందారు. ఈ క్ర మంలో మార్చిలో ఆయన ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. దీనిని నిలువరించేందుకు ఢిల్లీ అగ్ని మాపక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. నీళ్లు కొట్టారు. కానీ, ఆ ఇంట్లోని స్టోర్ రూమ్‌లో.. నిల్వ చేసి.. 500 రూపాయల నోట్ల కట్టలు(వందల కోట్లు ఉంటాయని అంచనా) బయట పడ్డాయి. వీటిలో సగం కాలి పోగా.. మిగిలిన వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే దేశంలో న్యాయవ్యవస్థపై విమర్శ ల పెల్లుబుకుతున్నాయి

ఖచ్చితంగా ఆసమయంలో వర్మ ఇంట్లో దొరికిన నగదు మరింత కలకలం రేపడంతో సుప్రీంకోర్టు సీరి యస్‌గా తీసుకుని.. ఆయనను ఎలాంటి పనీ అప్పగించకుండా.. అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. అంతేకాదు.. సదరు నోట్ల కట్టలపై విచారణకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కమిటీ వేసింది. ఈ కమిటీ పలుమార్లు విచారణ చేసి నివేదిక ఇచ్చింది. దీనిని అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా కేంద్రానికి పంపించారు. వర్మను పదవి నుంచి తప్పించాలని సిఫారసు చేశారు.

ప్రస్తుతం ఈ వ్యవహారంపై పార్లమెంటు ఉభయ సభల్లోనూ తీర్మానాలు పెండింగులో ఉన్నాయి. అయితే.. ఇంతలోనే సుప్రీంకోర్టు నియమించిన కమిటీలో తప్పులు ఎత్తి చూపుతూ.. సుప్రీంకోర్టును తప్పుబడుతు.. జస్టిస్ వర్మ.. అదే కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై రెండు సార్లు జరిగిన విచారణలో సుప్రీంకోర్టు ఆయనను తీవ్రంగా తప్పుబట్టింది.తాజాగా జరిగిన విచారణలో %---%వర్మ%-% తీరు.. న్యాయ వ్యవస్థపై క్షిపణి ప్రయోగం లాంటిది%--% అని వ్యాఖ్యానిస్తూ.. ఆయన పిటిషన్‌ను కొట్టి వేసింది. దీంతో పార్లమెంటు ద్వారా ఆయనను అభిశంసించేందుకు మార్గం సుగమం అయింది. చిత్రం ఏంటంటే.. ఈయన అభిశంసన తీర్మానం వివాదం అయి.. దేశ ఉపరాష్ట్రపతిగా ఉన్న ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

## కాలం గుర్తుచేస్తుంది.. ట్రంప్ సుంకాలపై జొమాటో సీఈవో పోస్ట్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ ఉత్పత్తులపై భారీగా పన్నులు విధించడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. భారత్‌ను మిత్రదేశంగా పేర్కొంటూనే, దిగుమతులపై 50% వరకు పన్నులు విధించాలన్న ఆయన నిర్ణయంపై రాజకీయ, పారిశ్రామిక వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

**ట్రంప్ పన్నుల వివరాలు**

ట్రంప్ తాజా ప్రకటన ప్రకారం భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా ఉత్పత్తులు, తోలు ఉత్పత్తులపై అదనంగా 25% పన్నులు విధించబడతాయి. ఇప్పటికే ఉన్న 25% పన్నులకు ఇది అదనం కావడంతో, మొత్తం పన్ను భారం 50%కు చేరనుంది. ఈ నిర్ణయం ఈ నెల 27వ తేదీ నుంచి అమలులోకి రానుంది. ఈ భారీ పన్నులు భారతీయ వ్యాపార రంగానికి పెద్ద సవాలుగా మారనున్నాయి.

**దీపిందర్ గోయల్ వ్యాఖ్యలు**


ఈ పరిణామాలపై గోయల్ తన ఎక్స్ ఖాతాలో ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఆయన పోస్ట్‌లో దేశానికి ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయి. "కాలం ఎప్పటికప్పుడు మన స్థానం ఏంటో గుర్తుచేస్తూనే ఉంటుంది. ఇప్పుడు పన్నుల రూపంలో మనముందు ఓ సవాల్ ఉంది. కానీ ఇవన్నీ ఎలా ఉన్నా, మన పనిని మనం నిరంతరం చేస్తూ ముందుకు సాగాలి. మన భవిష్యత్తును మనమే నిర్మించుకోకపోతే, ప్రపంచ శక్తులు మనపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఇలాంటి సమయంలో మనం ఆర్థికంగా, సాంకేతికంగా, రక్షణపరంగా, ముఖ్యంగా మన ఆశయాల్లో ఒక సమష్టిగా ముందుకు వెళ్లాలనే సంకల్పం తీసుకోవాలి. అప్పుడే మనం నిజమైన సూపర్‌పవర్‌గా ఎదుగుతాము." అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. చాలామంది గోయల్ వ్యాఖ్యలను దేశభక్తి, ధైర్యానికి నిదర్శనంగా పేర్కొంటున్నారు.

**భారత్ అధికారిక స్పందన**

ట్రంప్ నిర్ణయంపై భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది అన్యాయం.. అనుచితం అని పేర్కొంది. భారత ప్రభుత్వం తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అన్ని మార్గాలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అమెరికాతో ఈ అంశంపై చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. ఈ పరిణామాలు భవిష్యత్తులో అమెరికా-భారత్ సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తాయనేది వేచి చూడాలి.

ఈ క్లిష్ట సమయంలో గోయల్ వ్యాఖ్యలు ప్రజలలో ధైర్యాన్ని, ఆత్మనిర్భర్ భారత్ దిశగా ముందుకు సాగాలనే సంకల్పాన్ని నింపుతున్నాయి.

# వైసీపీ వర్సెస్ వివేకా !



వైసీపీకి ఎన్నో సమస్యలు మరెన్నో చిక్కు ముడులు ఆ పార్టీ నాయకులే చెప్పుకున్నట్లుగా సమస్యల నుంచి సంఘర్షణల నుంచి వైసీపీ పుట్టింది. ఈ రోజుకీ సమస్యలతోనే ఆ పార్టీ అలా ముందుకు సాగుతోంది అధికారంలో ఉన్నా లేకపోయినా వైసీపీకి ఉన్న సమస్యలు కొని తెచ్చుకున్న సమస్యలు ఇలా అనేకం ఉంటూనే ఉన్నాయి వాటి నుంచి బయటపడేందుకు వైసీపీ ప్రయత్నం చేస్తోందా లేక వాటితోనే ముందుకు సాగుతోందా అన్నదే ఒక సందేహంగా పేర్కొంటారు.

**బాబాయ్ తోనే అంతా :**

వైసీపీకి వివేకాకు రాజకీయ సంబంధం కంటే వ్యక్తిగత సంబంధమే ఎక్కువ. ఆయన జగన్ కి సొంత బాబాయ్. వైఎస్సార్ కి సొంత తమ్ముడు. దాంతో పాటు ఆయన కూడా రాజకీయాల్లో చురుకైన పాత్ర నిర్వహిస్తూ వచ్చారు. ఇక చూస్తే కనుక వైఎస్సార్ మరణించినపుడు వైఎస్ వివేకానందరెడ్డి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. జగన్ కాంగ్రెస్ ని వీడినపుడు ఆయన కాంగ్రెస్ ని అట్టిపెట్టుకునే ఉన్నారు. అదే పార్టీ ఆయనకు వ్యవసాయ మంత్రిగా అవకాశం ఇచ్చింది. ఆయననే వైఎస్ విజయమ్మ మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పులివెందుల నుంచి పోటీకి పెట్టింది. అలా వైసీపీకి ఆయన తొలి రోజులలో ఎదురు నిలిచే వచ్చారు.

**వైసీపీలో సైతం అలా :**

ఇక వైసీపీలోకి ఆయన 2014 ఎన్నికల ముందు వచ్చారు. ఆయన వైసీపీ విజయానికి ఆ ఎన్నికల్లో కృషి చేశారు అని చెబుతారు. ఇక 2016లో ఆయనకు స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ టికెట్ ఇస్తే ఓటమి పాలు అయ్యారు. ఇక 2019లో ఆయన మరోసారి వైసీపీ విజయానికి ప్రచారం చేస్తూనే దారుణ హత్యకు గురి అయ్యారు. ఈ హత్య ఎవరు చేశారు అస్మదీయులా తస్మదీయులా అన్న నిజాన్ని సీబీఐ నిగ్గు తేల్చలేకపోయింది. వైఎస్ వివేకాను హత్య చేసిన వారు అంటూ ఆయన కుమార్తె సునీత అయితే వైసీపీలోని కీలక నేతల వైపు వేలెత్తి చూపిస్తోంది.

**కొలిక్కి రాని కేసుతో :**

ఈ కేసు ఒక కొలిక్కి అయితే రావడం లేదు. శాఖాపరంగా తమ దర్యాప్తు పూర్తి అయింది అని సీబీఐ చెప్పవచ్చు కానీ రాజకీయంగా ఈ కేసు ఎప్పటికీ క్లోజ్ అయ్యేది ఉండదనే అంటున్నారు వైఎస్ కుమార్తె వేళ్ళు వైసీపీ మీద చూపిస్తున్నాయి. దాంతో వైసీపీకి తీవ్ర ఇరకాటంగానే ఉంటోంది. 2024 ఎన్నికల్లో వైఎస్ వివేకా హత్య కేసు విషయంలో వైఎస్ షర్మిల సునీత చేసిన ప్రచారం మీద వైసీపీ మీద తీవ్రంగా విమర్శించిన నేపథ్యంలో ఆ పార్టీ ఎంతగా నష్టపోయింది అందరికీ తెలిసిందే. ఇపుడు పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వచ్చింది. దీంతో మరోసారి సునీత తన తండ్రి హత్యను గుర్తు చేసుకుంటూ వైసీపీ మీదనే ఘాటు విమర్శలే చేశారు.

**వెంటాడుతున్న వివేకా :**

వైసీపీని వివేకా ఒక విధంగా వెంటాడుతున్నారా అన్న చర్చ సాగుతోంది. వైసీపీ 2024 ఎన్నికల్లో ఓడింది. కానీ దారుణమైన పరాజయం పునాదులలో నుని బలంగా ఉన్న చోట సంభవించింది అంటే దానికి కారణం వివేకా హత్య కేసు అనే విశ్లేషిస్తారు ఈ విషయంలో వైసీపీ తన సత్య సంధతను ఎక్కడ నిరూపించుకుంటుందో తెలియదు కానీ ఆ పార్టీకి అయితే రాజకీయంగా మాత్రం ఇబ్బందులు తెచ్చేది గానే ఉంది. ప్రత్యర్ధులు రాయలసీమకు వచ్చినపుడల్లా ఈ హత్య కేసుని ప్రస్తావిస్తారు దాంతో వైసీపీకి ఇరాకాటంగానే ఉంటుంది అని అంటున్నారు. మరి వైసీపీ తన ప్రత్యర్ధులతో పోరాటం చేస్తోంది కానీ వివేకా రూపంలో ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కారం కనుగొనలేకపోతోంది. అలా కనుగొన్న నాడే వైసీపీకి పులివెందుల అయినా కడప అయినా రాయలసీమ అయినా పూర్తి పూర్వ వైభవం దక్కుతుందన్న విశ్లేషణలు అయితే ఉన్నాయి. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# రేవంత్‌కు ఇన్సల్ట్ జరిగిందా?.. ఏంటీ చర్చ!



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవమానం జరిగిందా? ఆయన ఆవేదన చెందారా? అంటే.. ఔననే అంటున్నారు కాంగ్రెస్ నాయకులు. ఈ విషయంపై ప్రతిపక్షాలు కూడా కామెంటు చేస్తున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న రేవంత్ రెడ్డి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి చూస్తున్నారు. అయితే.. ఈ విషయంలో జోక్యం చేసుకుని కేంద్రం బిల్లుకు అడ్డు పడుతోందన్న వాద నను రేవంత్ రెడ్డి వినిపిస్తున్నారు. అయితే.. ఢిల్లీలో ధర్నా చేయడం ద్వారా.. జాతీయస్థాయిలో తమ డిమాండ్‌ను చర్చించేలా చేయాలని ప్లాన్ చేశారు. అది జరిగింది. ఇక, ఈ పరిణామాలు ఇలా ఉంటే.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయి.. ఈ విషయంపై ఏదో ఒకటి తేల్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. దీనికి గాను.. ఆయన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అంటే.. పక్కా ప్రూఫులు, బీసీలపై చేయించిన కులగణన రిపోర్టు.. వంటివాటిని కూడా సిద్ధంగా ఉంచుకున్నారు. రాష్ట్రపతి ఏం కోరినా సమర్పించేలా అధికారులనుకూడా రెడీ చేశారు. అయితే.. రాష్ట్రపతి అప్పాయింట్‌మెంటు విషయంలోనే సీఎం రేవంత్‌కు ఇన్సల్ట్ జరిగిందనే చర్చ తెర మీదికి వచ్చింది. తొలుత రాష్ట్రపతి కార్యాలయం నుంచి అప్పాయింట్‌మెంటును ఖరారు చేస్తూ.. సమా చారం అందినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ.. గంటలోనే ఈ సమాచారం డిలీట్ కావడం.. దీనిపై ఎలాం టి అప్‌డేట్ లేకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి కూడా.. రాష్ట్రపతి అప్పాయింట్మెంటుపై ఆసక్తికర వ్యాఖ్య లు చేశారు.

రాష్ట్రపతి అప్పాయింట్‌మెంటు ఇచ్చే విషయంలోనూ కేంద్ర పెద్దలుజోక్యం చేసుకుంటున్నా రని అన్నా రు. ఇది ప్రజాస్వామ్యంలో మంచిది కాదరని.. రాజ్యాంగ బాధ్యతలు నిర్వర్తించే వారిని కూడా తమ చెప్పు చేతల్లో పెట్టుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే రెండు రోజులు గడుస్తోందని.. రాష్ట్రపతి అ ప్పాయింట్‌మెంటు కోసం వేచి చూస్తున్నామని అన్నారు. ఈ పరిణామాలపై ఇటు కాంగ్రెస్ పార్టీ నాయ కులు.. అటు విపక్ష నాయకులు కూడా అవ మానం జరిగిందనే వ్యాఖ్యలు చేస్తున్నారు. మరి ఎప్పటికి రేవం త్‌కు రాష్ట్రపతి అప్పాయింట్‌మెంటు లభిస్తుందో చూడాలి.

# కేసీఆర్...జైలూ...రేవంత్ కామెంట్స్ వైరల్ !



తెలంగాణాలో రాజకీయం పీక్స్ కి చేరుకుంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను ప్రభుత్వానికి అప్పగించడంతో ఒక్కసారిగా పాలిటిక్స్ హీటెక్కింది ఈ నివేదికలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీద ఆరోపణలు ఉన్నాయి. అలాగే ప్రాజెక్ట్ ని పెద్ద ఎత్తున అప్పులు తెచ్చి అనవసర వ్యయం చేశారు అన్నది కూడా నివేదిక చెబుతోంది. దాంతో ఈ ప్రాజెక్టు నివేదికను అసెంబ్లీలో పెట్టి అందరి అభిప్రాయం తీసుకుని ఆ మీదట చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటోంది అన్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిజంగా ఈ కేసులో ఏమవుతుంది అన్న చర్చ అయితే అందరిలో ఉంది.

**కేసీఆర్ కేరాఫ్ ఫాం హౌస్ :**

తెలంగాణా జాతిపితగా తన పార్టీ క్యాడర్ చేత అభిమానుల చేత గొప్పగా పిలిపించుకునే కేసీఆర్ గత రెండేళ్ళుగా ఎర్రవెల్లి ఫాం హౌస్ కే పరిమితం అయ్యారు. ఆయన బయటకు పెద్దగా రావడం లేదు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఆయనను చూసేందుకు కూడా అభిమానులకు క్యాడర్ కి కూడా అంతగా అవకాశం అయితే దక్కడం లేదు ఒక విధంగా చూస్తే కేసీఆర్ కొందరు పార్టీ ముఖ్యులతో తప్ప ఎవరినీ కలవడం లేదు అని అంటున్నారు. దాంతో అదే ఆయనకు స్వీయ నిర్భంధంగా మారిందా అన్నది కూడా ప్రత్యర్థుల విమర్శగా ఉంది.

**అంతకంటే పెద్ద శిక్ష :**

తెలంగాణాను సాధించిన నేతగా రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కి తెలంగాణాలో ఇపుడు అధికారం పోయింది. దాంతో ఆయన జనాలకు దూరంగా ఫాం హౌస్ లో ఉంటున్నారు. ఒక విధంగా ఆయనకు ఆయనే స్వీయం నిర్బంధంలో ఉంటున్నారు అది చాలాదా అంటున్నారు తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి. ఆయనకు అంతకంటే పెద్ద శిక్ష వేరేగా కావాలా అని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ ఉన్న ఎర్రవెల్లి ఫాం హౌస్ కి చర్లపల్లి జైలుకు పెద్ద తేడా ఏముంది అంటూ రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఎక్కడ అయినా ఒక్కటేగా అని అంటున్నారు.

**కక్ష సాధింపు లేదా :**

తనకు కేసీఆర్ మీద రాజకీయ కక్ష ఏమీ లేదని ఆయన విషయంలో కక్ష సాధింపు చర్యలు తీసుకోమని కూడా చెబుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో నివేదిక మీద అసెంబ్లీలో చర్చింది ఆ మీదట ఏ రకమైన చర్యలు తీసుకోవాలో తీసుకుంటామని ఆయన అంటున్నారు. రేవంత్ రెడ్డి మాటలు బట్టి చూస్తే కేసీఆర్ కి జైలు అరెస్టు ఇలాంటివి అన్నీ ఏమీ ఉండవనే అంటున్నారు ఆయన విషయంలో తనకు కన్సర్న్ ఉందని అందుకే ఆయన అనారోగ్యం పాలు అయినపుడు కూడా వెళ్ళి పరామర్శించాను అని చెబుతున్నారు.

**అంతా వ్యూహాత్మకమేనా :**

జైలుకు కేసీఆర్ ని పంపుతారు అన్న వార్తలు ఒట్టివి అన్నది రేవంత్ రెడ్డి మాటలు స్పష్టం చేస్తున్నాయి. కేసీఆర్ ని నిజంగా ఈ వయసులో జైలుకు పంపిస్తే అది కచ్చితంగా కాంగ్రెస్ కే బూమరాంగ్ డెసిషన్ అవుతుంది అని అంటున్నారు. పైగా కేసీఆర్ కి ఒక్కసారిగా సానుభూతిని అందించిన వారు అవుతారని అంటున్నారు. జైలుకు వెళ్ళిన వారు అంతా విజేతలుగానే ఉన్నారని రాజకీయ వర్తమానం నిరూపిస్తోంది. అందుకే కేసీఆర్ విషయంలో కాంగ్రెస్ తొందరపడదనే అంటున్నారు. మొత్తానికి ఎర్రవెల్లి ఫాం హౌస్ చర్లపల్లి జైలు రెండూ ఒక్కటే అని రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ మాత్రం వైరల్ అవుతున్నాయి

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# మధుమేహులకు టీబీతో ప్రాణాలకే ముప్పు..

## తాజా పరిశోధనలో కీలక విషయాలు

- దయాబెటిస్ ఉన్నవారికి టీబీ సోకే ముప్పు మూడు రెట్లు ఎక్కువ
- టీబీ చికిత్స సమయంలో మరణించే ప్రమాదం రెట్టింపు అవుతున్నట్టు వెల్లడి
- అధిక చక్కెర స్థాయిలతో రోగనిరోధక శక్తి తగ్గడమే ప్రధాన కారణం
- మధుమేహుల్లో టీబీ చికిత్స విఫలమయ్యే అవకాశాలు ఎక్కువ
- టీబీ రోగులకు డయాబెటిస్, మధుమేహులకు టీబీ పరీక్షలు తప్పనిసరి అని సూచన

మధుమేహం (డయాబెటిస్)తో బాధపడుతున్న వారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, వారికి క్షయ (టీబీ) వ్యాధి సోకితే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఇటీవలి వైద్య పరిశోధనలు తీవ్రంగా హెచ్చరిస్తున్నాయి. సాధారణ వ్యక్తులతో పోలిస్తే, డయాబెటిస్ ఉన్నవారికి టీబీ సోకే అవకాశం మూడు రెట్లు అధికంగా ఉండటమే కాకుండా, చికిత్స సమయంలో మరణించే ప్రమాదం కూడా రెట్టింపు అవుతోందని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రెండు వ్యాధులు కలిసి రావడం ప్రపంచ ఆరోగ్యానికి పెను సవాలుగా మారిందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రోగనిరోధక శక్తిపై డయాబెటిస్ ప్రభావం

డయాబెటిస్, టీబీ మధ్య ఉన్న ఈ ప్రమాదకర సంబంధానికి ప్రధాన కారణం రోగనిరోధక శక్తి బలహీనపడటమే. డయాబెటిస్ వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు దీర్ఘకాలం పాటు అధికంగా ఉండటం వల్ల శరీర రోగనిరోధక వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. ముఖ్యంగా టీబీకి కారణమయ్యే 'మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్' అనే బ్యాక్టీరియాపై పోరాడే కీలకమైన టి-హెల్పర్ కణాలు, మాక్రోఫేజ్‌ల వంటి వాటి సామర్థ్యం తగ్గిపోతుంది. దీనివల్ల డయాబెటిస్ ఉన్నవారు కొత్తగా టీబీ బారిన పడటమే కాకుండా, వారిలో నిద్రాణంగా ఉన్న టీబీ మళ్లీ విజృంభించే ప్రమాదం కూడా పెరుగుతుంది. అంతేకాకుండా యాంటీబయాటిక్ మందులకు శరీరం సరిగా స్పందించకపోవడంతో చికిత్స కూడా కష్టతరం అవుతుంది.

### అధ్యయనాల్లో ఏం తేలింది?

భారత్, పెరూ, రొమేనియా, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో జరిపిన అధ్యయనాలు ఈ వాస్తవాన్ని ధృవీకరించాయి. అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న మధుమేహులలో టీబీ ముప్పు మరింత ఎక్కువగా ఉన్నట్టు తేలింది. చాలా మంది టీబీ రోగులను పరీక్షించగా, వారిలో అధిక రక్త చక్కెర (హైపర్‌గ్లైసీమియా) ఉన్నట్టు గుర్తించారు. దీన్ని బట్టి టీబీ, డయాబెటిస్ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని స్పష్టమవుతోంది.

ఈ నేపథ్యంలో డయాబెటిస్ ఉన్న రోగులకు టీబీ పరీక్షలు, టీబీ సోకిన వారికి డయాబెటిస్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రెండు వ్యాధులు ఉన్నవారికి ప్రత్యేక వైద్య పద్ధతులను అనుసరించడం ద్వారా చికిత్సను విజయవంతం చేసి, మరణాల రేటును తగ్గించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

# బాల్యానికీ హార్మోన్ల సంకటం





పిల్లలే మన భవిష్యత్తు. అందుకే వారి అవసరాలు, చదువు, నడవడి మీద ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. ఆరోగ్యం మీదా శ్రద్ధ తీసుకుంటాం. కానీ పిల్లల ఆరోగ్యంపై హార్మోన్లు ప్రభావం చూపు తాయన్న విషయమే పెద్దగా తెలియదు. ఆ మాటకొస్తే- హార్మోన్ల సమస్యలు పెద్దవారికే పరిమితమని భావిస్తుంటాం. ఇవి పిల్లల్లోనూ ఎక్కువే. ఇటీవల మరింత ఎక్కువవుతున్నాయి కూడా. చిక్కేంటంటే- హార్మోన్ల హెచ్చుతగ్గులతో పొడసూపే లక్షణాలు అంత ప్రస్ఫుటంగా లేకపోవటం. వీటిని సకాలంలో గుర్తించి, చికిత్స చేయగలిగితే పిల్లల ఆరోగ్యం, భావి జీవితం గాడి తప్పకుండా చూసుకోవచ్చు.పిల్లలే మన భవిష్యత్తు. అందుకే వారి అవసరాలు, చదువు, నడవడి మీద ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. ఆరోగ్యం మీదా శ్రద్ధ తీసుకుంటాం. కానీ పిల్లల ఆరోగ్యంపై హార్మోన్లు ప్రభావం చూపు తాయన్న విషయమే పెద్దగా తెలియదు. ఆ మాటకొస్తే- హార్మోన్ల సమస్యలు పెద్దవారికే పరిమితమని భావిస్తుంటాం. ఇవి పిల్లల్లోనూ ఎక్కువే. ఇటీవల మరింత ఎక్కువవుతున్నాయి కూడా. చిక్కేంటంటే- హార్మోన్ల హెచ్చుతగ్గులతో పొడసూపే లక్షణాలు అంత ప్రస్ఫుటంగా లేకపోవటం. వీటిని సకాలంలో గుర్తించి, చికిత్స చేయగలిగితే పిల్లల ఆరోగ్యం, భావి జీవితం గాడి తప్పకుండా చూసుకోవచ్చు.

మన శరీరంలో బోలెడన్ని గ్రంథులుంటాయి. హార్మోన్లు వీటి నుంచే విడుదలవుతాయి. రసాయన సమాచార వాహకాలుగా పనిచేసే ఇవి శరీరంలో జరిగే రకరకాల ప్రక్రియలను నియంత్రిస్తుంటాయి. శరీర ఎదుగుదల, బుద్ధి కుశలత, యౌవనదశ ఆరంభం, గ్లూకోజు జీవక్రియ, ఎముకల పటుత్వం, మానసిక ధోరణి, నిద్ర దగ్గరి నుంచి రక్తపోటు, జీవ ద్రవాలు, లవణాల నియంత్రణ వరకూ ఎన్నెన్నో పనుల్లో పాలు పంచుకుంటాయి. నిజానికి గ్రంథుల వ్యవస్థ పనిచేయటం పిండస్థ దశ నుంచే మొదలవుతుంది. పిండం ఎదుగుదలకు తోడ్పడటమే కాదు.. స్త్రీ, పురుష లింగాన్ని నిర్ణయించటంలోనూ హార్మోన్లే కీలకం. పిట్యుటరీ, థైరాయిడ్, పారాథైరాయిడ్, క్లోమ గ్రంథులతో పాటు అండాశయాలు, వృషణాలు కూడా హార్మోన్లను విడుదల చేస్తుంటాయి. కొందరిలో ఇవి అవసరమైన దాని కన్నా తక్కువ ఉత్పత్తి కావొచ్చు. కొందరిలో ఎక్కువగానూ విడుదల కావొచ్చు. ఇదే సమస్యలకు దారితీస్తుంటుంది. పిల్లల్లో వచ్చే హార్మోన్ల సమస్యల్లో చాలా రకాలే ఉన్నాయి. వీటిల్లో థైరాయిడ్, అడ్రినలిన్, క్లోమం, పిట్యుటరీ గ్రంథితో ముడిపడిన సమస్యలను ప్రధానంగా చెప్పుకోవాల్సి ఉంటుంది.

### థైరాయిడ్ గండం

పిల్లల్లో తలెత్తే హార్మోన్ల సమస్యల్లో ముఖ్యమైంది హైపోథైరాయిడిజమ్. దీనికి మూలం థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోవటం. ఫలితంగా గ్రంథి నుంచి టీ3, టీ4 హార్మోన్ల విడుదల దెబ్బతింటుంది. శరీరం సక్రమంగా పనిచేయటానికి తోడ్పడే ఈ హార్మోన్లు లోపిస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. తగినంత ఎత్తు ఎదగకపోవటం, క్రమంగా బరువు పెరగటం, మలబద్ధకం, చలి తట్టుకోలేకపోవటం.. చర్మం, వెంట్రుకలు పొడిబారటం, త్వరగా అలసిపోవటం, కండరాల నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. కొందరికి యౌవనదశ/రజస్వల ఆలస్యం కావొచ్చు. కొందరికి ముందుగానే మొదలవ్వచ్చు. ఇలాంటి లక్షణాలను గుర్తిస్తే హైపోథైరాయిడిజమ్ కావొచ్చని అనుమానించాలి. ముఖ్యంగా మెడ వద్ద ఉబ్బు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు. థైరాయిడ్ హార్మోన్ పరీక్ష (టీఎఫ్‌టీ) చేస్తే సమస్య ఉందో లేదో తెలుస్తుంది. ఒకసారి జబ్బును నిర్ధరిస్తే చికిత్స తేలికే. రోజుకు ఒకసారి పరగడుపున థైరాయిడ్ మాత్ర వేసుకుంటే చాలు. తరచూ పరీక్ష చేయిస్తూ మందు మోతాదులను మార్చుకోవాల్సి ఉంటుంది. చాలామందికిది జీవితాంతం అవసరమవుతుంది.

**పుట్టుకతోనే:** కొందరికిది పుట్టుకతోనే (కంజెనటల్) థైరాయిడ్ సమస్య ఉండొచ్చు. థైరాయిడ్ గ్రంథి అసలే ఏర్పడకపోవటం, ఏర్పడినా చిన్నగా ఉండటం, మెడలో వేరే చోట ఉండటం వంటివి దీనికి దోహదం చేస్తుంటాయి. ఇది పిల్లల్లో విషయ గ్రహణ సామర్థ్యాన్ని, బుద్ధి కుశలతను దెబ్బతీస్తుంది. కాబట్టి వీలైనంత త్వరగా గుర్తించటం ముఖ్యం. కనీసం 2 వారాల వయసు నుంచే హార్మోన్ ఇచ్చి, చికిత్స చేస్తే మందబుద్ధిని నివారించుకోవచ్చు. కాకపోతే పుట్టినప్పుడు దీని లక్షణాలు గుర్తించటం అంత తేలిక కాదు. దీంతో లోలోపలే మెదడు దెబ్బతింటూ వస్తుంది. ఒకసారి మెదడు దెబ్బతింటే దాన్ని వెనక్కి మళ్లించటం అసాధ్యం. అందువల్ల పిల్లలందరికీ పుట్టిన వెంటనే రక్త పరీక్ష చేస్తే దీన్ని ముందే పట్టుకోవచ్చు. పుట్టుకతో వచ్చే హైపోథైరాయిడిజమ్ శాశ్వతంగా ఉండొచ్చు. కొందరికి కొంతకాలం తర్వాత తగ్గొచ్చు. టీ4 హార్మోన్ చికిత్సతో సమస్య కుదురుకుంటుంది. ఒకవేళ స్వల్పకాల సమస్యగా అనుమానిస్తే రెండు, మూడేళ్ల తర్వాత చికిత్సను ఆపేసి చూడాల్సి ఉంటుంది.

### మధుమేహ ప్రమాదం

పెద్దవారిలోనే కాదు.. పిల్లల్లోనూ ఇప్పుడు మధుమేహం ఎక్కువవుతోంది. వీరిలో ప్రధానంగా కనిపించేది టైప్ 1 రకం మధుమేహం. దీనికి మూలం క్లోమగ్రంథిలో ఇన్సులిన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసే బీటా కణాలు పనిచేయకపోవటం. రక్తంలో గ్లూకోజు మోతాదులను నియంత్రించటానికి ఇన్సులిన్ తప్పనిసరి. అందువల్ల టైప్ 1 మధుమేహానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవటం తప్ప మరో మార్గం లేదు. ఎక్కువసేపు పనిచేసే (బేసల్), తక్షణం పనిచేసే (బోలస్) ఇన్సులిన్లు కలగలసిన విధానం పిల్లలకు బాగా ఉపయోగ పడుతుంది. బేసల్ రకం రోజంతా ఇన్సులిన్ మోతాదులు స్థిరంగా ఉండేలా చేస్తే.. భోజనానికి ముందు తీసుకునే బోలస్ రకమేమో గ్లూకోజు మోతాదులు ఉన్నట్టుండి పెరగకుండా నిలువరిస్తుంది. రోజుకు కనీసం 4-5 ఇంజెక్షన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇవి మధుమేహంతో ముంచుకొచ్చే సమస్యల ముప్పు తగ్గటానికే కాకుండా, అవి తీవ్రం కాకుండానూ కాపాడతాయి. గ్లూకోమీటర్‌తో గానీ చర్మానికి అతికించుకునే సెన్సర్ల ద్వారా గానీ రక్తంలో గ్లూకోజు మోతాదులను నిరంతరం గమనిస్తూ ఉండటం చాలా ముఖ్యం. అలాగే పిండి పదార్థాలు తక్కువ తక్కువగా తీసుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం వంటి జాగ్రత్తలూ తీసుకోవాలి.

కణాలు ఇన్సులిన్‌కు స్పందించకపోవటం వల్ల తలెత్తే టైప్ 2 మధుమేహం కూడా పిల్లల్లో అధికంగా కనిపిస్తోంది. అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవటం వంటివి ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఆరోగ్యకరమైన, ఇంట్లో వండిన ఆహారం తినటం, తగినంత మోతాదులో తినటం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం, వ్యాయామం చేయటం వంటి వాటితో దీన్ని ముందుగానే నివారించుకునే వీలుండటం గమనార్హం.

### లక్షణాలు, హెచ్చరిక సంకేతాలు

పిల్లల్లో.. పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వరకూ హార్మోన్ల సమస్యలు ఎప్పుడైనా తలెత్తొచ్చు. ఇవి శారీరక ఎదుగుదల, భావోద్వేగాలు, సామాజిక సంబంధాల మీద గణనీయమైన ప్రభావం చూపిస్తాయి. అందువల్ల వీటిని సకాలంలో గుర్తించి, జాగ్రత్త పడటం చాలా ముఖ్యం. ఆయా లక్షణాలు, హెచ్చరిక సంకేతాలను బట్టి వీటిని అనుమానించొచ్చు.

బరువు అంతగా పెరగకపోవటం లేదా నెమ్మదిగా పెరగటం.

వయసుకు తగినంత ఎత్తు లేకపోవటం.

బరువు అధికంగా ఉండటం.

దాహం ఎక్కువగా వేయటం, తరచూ మూత్రానికి వెళ్లటం.

రక్తంలో గ్లూకోజు మోతాదులు అసాధారణంగా ఉండటం.

మెడ వద్ద ఉబ్బు.

యౌవన లక్షణాలు ముందే మొదలవటం.

అమ్మాయిల్లో రజస్వల ఆలస్యం కావటం.

మెడ, చంకలు, గజ్జల్లో చర్మం నల్లగా అవటం లేదా రంగు మారటం.

యుక్తవయసు ఆడపిల్లల్లో నెలసరి సరిగా కాకపోవటం.

జననాంగాలు భిన్నంగా ఉండటం.

పిల్లలను ఆడ, మగ అని నిర్ణయించలేకపోవటం.

### యౌవనం ముందుగానే..

యౌవనదశలో పిల్లలు లైంగికంగా పరిపక్వం చెందుతూ వస్తుంటారు. ఇది మెదడులోని పిట్యుటరీ గ్రంథి నుంచి విడుదలయ్యే హార్మోన్లతో మొదలవుతుంది. ఈ హార్మోన్లు అమ్మాయిల్లో అండాశయాలకు, అబ్బాయిల్లో వృషణాలకు సంకేతాలు చేరవేస్తాయి. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు యౌవనం చాలా ముందే వస్తోంది. పిల్లలకు.. ముఖ్యంగా మధ్య, ఉన్నత వర్గాలకు చెందినవారికి మంచి పోషకాహారం అందుబాటులో ఉండటం, మొత్తంగా ఆరోగ్య పరిస్థితి మెరుగవటం వంటివి ఇందుకు దోహదం చేస్తుండొచ్చని భావిస్తున్నారు. కొందరు అమ్మాయిల్లో 8 ఏళ్లు, అబ్బాయిల్లో 9 ఏళ్లకు ముందే యౌవనం ఆరంభమవు తుండటం గమనార్హం. ఇది అమ్మాయిల్లో మరింత ఎక్కువగానూ కనిపిస్తోంది. వీరిలో 90% మందిలో దీనికి కారణమేంటనేది కచ్చితంగా తెలియదు. అందువల్ల త్వరగా యౌవన లక్షణాలు కనిపిస్తే కారణమేంటన్నది గుర్తించాలి. ఇవి ఎప్పుడు మొదలవుతున్నాయో తల్లిదండ్రులు గమనించటం ముఖ్యం. అమ్మాయిలకు చిన్నవయసులోనే రొమ్ములు పెరగటం లేదా జననాంగాల వద్ద వెంట్రుకలు మొలవటం.. అబ్బాయిలకు వృషణాల సైజు పెరగటం లేదా జననాంగాల వద్ద వెంట్రుకలు మొలవటం కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. రక్త పరీక్ష, ఎముకల వయసు గణన ద్వారా ముందుగానే యౌవనం ఆరంభమవుతుందేమో పరిశీలిస్తారు. అలాగే మెదడులో పిట్యుటరీ గ్రంథి స్థితిని తెలుసుకోవటానికి ఎంఆర్ఐ స్కాన్ చేయిస్తారు. అవసరమైతే యౌవన/రజస్వల వాయిదా వేయటానికి మందులు సూచిస్తారు. లేకపోతే శరీర ఎత్తు పరిమితమయ్యే ప్రమాదముంటుంది.

### ఎత్తుకు ఆటంకం


సాధారణంగా పిల్లలు 18 ఏళ్ల వరకూ ఎత్తు పెరుగుతారని భావిస్తుంటారు. నిజానికి అమ్మాయిల్లో రజస్వల అయ్యాక రెండేళ్ల తర్వాత ఎత్తు పెరగటం ఆగుతుంది. అబ్బాయిల్లో 16-18 ఏళ్ల వయసులో ఎత్తు పెరగటం నిలిచిపోతుంది. దీనికి కారణం శరీరంలో పొడవైన ఎముకల చివర్లు అతుక్కుపోవటం. ఆ తర్వాత ఏం చేసినా ఎత్తు పెరగరు. పుట్టినప్పుడు పొడవు, ఆ తర్వాత ఎదుగుదల, పోషకాహారం, శారీరక శ్రమ, జన్యువులు, హార్మోన్ల మీద శరీర ఎత్తు ఆధారపడుతుంది. ముఖ్యంగా థైరాయిడ్ హార్మోన్లు, పిట్యుటరీ గ్రంథి నుంచి విడుదలయ్యే గ్రోత్ హార్మోన్లు, యౌవనదశలో లైంగిక హార్మోన్లు ఎత్తు మీద పెద్ద ప్రభావం చూపుతాయి. అందువల్ల పిల్లలు ఎత్తు పెరగటం లేదని గమనిస్తే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. దీనికి హార్మోన్ల లోపం కారణమవుతుంటే వెంటనే హార్మోన్ల చికిత్స చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

### ఊబకాయ ఊబి

ఊబకాయం పెద్ద ప్రజారోగ్య సమస్యగా మారింది. ఇది 5-19 ఏళ్ల పిల్లల్లో గణనీయంగా పెరుగుతోంది. ఇప్పుడు 0-5 ఏళ్ల పిల్లల్లోనూ అధిక బరువు, ఊబకాయం కనిపిస్తోంది. ఇందుకు జన్యువులు, కుటుంబ చరిత్ర, జీవనశైలి, కొన్నిరకాల మందులు, ఆహార అలవాట్ల వంటి రకరకాల అంశాలు కారణం కావొచ్చు. అంతేకాదు.. లెప్టిన్, ఘ్రెలిన్, ఇన్సులిన్, కార్టిజాల్, థైరాయిడ్, లైంగిక హార్మోన్ల పనితీరు అస్తవ్యస్తం కావటమూ దీనికి దోహదం చేయొచ్చు. దీన్ని ముందే అరికట్టటం ముఖ్యం. ఎందుకంటే బాలల్లో ఊబకాయం పెద్దయ్యాకా కొనసాగొచ్చు. అధిక రక్తపోటు, మధుమేహం, కాలేయానికి కొవ్వు పట్టటం, అధిక కొలెస్ట్రాల్, అమ్మాయిల్లో అండాశయాల్లో నీటి తిత్తుల (పీసీఓడీ) వంటి సమస్యల ముప్పు పెరగటానికీ కారణమవుతుంది. ఊబకాయంతో పిల్లలకు కుంగుబాటు (డిప్రెషన్), ఆత్మన్యూనత, ఆందోళన వంటి మానసిక సమస్యలు వచ్చే అవకాశమూ ఎక్కువే. కాబట్టి పిల్లల్లో ఊబకాయానికి కారణాలేంటన్నది కనుక్కోవాలి. చిన్నప్పటి నుంచే సమతులాహారం తినటం, తీపి పానీయాలు పరిమితం చేయటం, డిజిటల్ పరికరాల వాడకాన్ని తగ్గించటం, శారీరక శ్రమ చేసేలా ప్రోత్సహించటం వంటివి అలవాటు చేస్తే బరువు మరీ పెరగకుండా చూసుకోవచ్చు.

# హీరోయిన్స్ నందు జాన్వీ కపూర్ వేరయ్యా...!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూనే ఉంది. గత ఆరు.. ఏడు ఏళ్లుగా జాన్వీ కపూర్ సినిమాలు చేస్తూనే ఉంది. కానీ ఇప్పటి వరకు అక్కడ హిట్ పడలేదు. నటిగా మంచి మార్కులు దక్కించుకుంటుంది, అందంతో కవ్విస్తుంది, ఆకర్షిస్తుంది. దాంతో జాన్వీ కపూర్‌కి వరుస ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. తాజాగా ఈమె హిందీ ప్రేక్షకుల ముందుకు హోమ్బౌండ్ సినిమాతో వెళ్లింది. ఆ సినిమా సైతం జాన్వీ కపూర్‌కి మళ్లీ నిరాశను మిగిల్చింది. బాలీవుడ్‌లో ఈమె చేసిన సినిమాలన్నీ వరుసగా ఫ్లాప్‌లు అవుతున్నా పారితోషికం విషయంలో తగ్గడం లేదు. పై పెచ్చు సినిమా సినిమాకు పారితోషికం పెంచుతూ వస్తుందట.ప్రస్తుతం హిందీలో రెండు సినిమాలు, తెలుగులో ఒక సినిమాను చేస్తున్న జాన్వీ కపూర్ పారితోషికం గురించి షాకింగ్ వార్తలు ప్రచారం జరుగుతున్నాయి. హిందీ సినిమాలకు నామమాత్రంగా వసూళ్లు చేస్తున్న జాన్వీ కపూర్ టాలీవుడ్ సినిమాలకు మాత్రం షాకింగ్ రేంజ్‌లో డిమాండ్ చేస్తుందట. దేవర సినిమాకు అప్పట్లో రూ. 4.5 కోట్ల నుంచి రూ. 5 కోట్ల మధ్య పారితోషికం తీసుకుందనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు రామ్ చరణ్‌తో బుచ్చిబాబు దర్శకత్వంలో చేస్తున్న సినిమాలో నటిస్తున్నందుకు అంతకు మించి పారితోషికం అందుకుందట. దేవర సినిమా విడుదలకు ముందే ఆ సినిమా కమిట్ అయింది కాబట్టి సరే పారితోషికం ఎక్కువ డిమాండ్ చేసిందని అనుకోవచ్చు.ఎన్టీఆర్ దేవర సినిమా భారీ ఓపెనింగ్స్ అయితే రాబట్టింది కానీ, సూపర్ హిట్ సినిమాల జాబితాలో నిలువలేదు అనేది వాస్తవం. అంతే కాకుండా ఆ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు పెద్దగా ప్రాముఖ్యత లేదు. ఆమె చేసిన చాలా హిందీ సినిమాలతో పోల్చితే దేవర సినిమాలో చేసిన పాత్ర పరిధి చాలా తక్కువగా ఉంది. అయినా కూడా ఆ స్థాయి పారితోషికం ఎలా అందుకుందని చాలా మంది బాలీవుడ్ వర్గాల వారు ముక్కున వేలేసుకున్నారట. జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో చేస్తున్న సినిమాలకు తీసుకుంటున్న పారితోషికం ఆమె గత చిత్రాల ఫలితాలతో పోల్చితే చాలా ఎక్కువే అని చెప్పాలి. ఇక ఆమె తెలుగు సినిమాలకు



తీసుకుంటున్న పారితోషికం మరీ ఎక్కువ అనే టాక్ వినిపిస్తుంది.జాన్వీ కపూర్ ప్రస్తుతం చేస్తున్న రామ్ చరణ్, బుచ్చిబాబు సినిమా పారితోషికంను మించి మరో తెలుగు సినిమాకు డిమాండ్ చేసిందట. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఆ సినిమాలో నటించేందుకు గాను ఏకంగా రూ. 6.5 కోట్ల నుంచి రూ. 7 కోట్ల మధ్య పారితోషికంను ఆమె డిమాండ్ చేసిందట. దాంతో నిర్మాతలు, మేకర్స్ అవసరమా అనే ఆలోచనలో ఉన్నారు. మంచి సినిమాలు చేయాలి, మంచి పాత్రలు చేయాలి, హిట్ కొట్టాలి అని కాకుండా జాన్వీ కపూర్ సినిమా సినిమాకు పారితోషికం పెంచుకుంటూ పోవాలి అనే ఆలోచన మంచిది కాదని, అది కెరీర్‌ను నాశనం చేస్తుందని సినీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. తెలుగులోనూ హిందీ సినిమాలకు తీసుకుంటున్నట్లుగా పారితోషికం తీసుకోవడం ఉత్తమం అని చాలా మంది సూచిస్తున్నారు. జాన్వీ మాత్రం తెలుగు, తమిళ సినిమాలు అనగానే పారితోషికంను ఆకాశమే హద్దు అన్నట్లుగా పెంచి చెబుతోంది.







# ఒకే ప్రొడక్షన్ లో ఎన్టీఆర్.. రెండు భారీ ప్రాజెక్ట్స్..?



మాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ సినిమాల లైనప్ ఆయన ఫ్యాన్స్ కి సూపర్ కిక్ ఇస్తుంది. ఆల్రెడీ వార్ 2 పూర్తి చేసిన తారక్ ఆ సినిమాతో ఆగస్టు 14న రాబోతున్నాడు. వార్ 2 పూర్తి కాగానే ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో సినిమా పనుల్లో బిజీ అయ్యాడు ఎన్టీఆర్. ప్రశాంత్ నీల్ తో చేస్తున్న డ్రాగన్ సినిమాకు పూర్తి సపోర్ట్ అందిస్తున్నాడట. ఆ సినిమా షూటింగ్ కూడా అనుకున్నది అనుకున్నట్టుగా జరుగుతుందట. ఐతే ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమా పూర్తయ్యాక నెక్స్ట్ త్రివిక్రం లైన్ లో ఉన్నాడు.ఎన్టీఆర్ త్రివిక్రం కాంబో సినిమా వెరైటీ కాన్సెప్ట్ తో వస్తుందని తెలుస్తుంది. ఈమధ్యనే ఎన్టీఆర్ మురుగన్ బుక్ తో కనిపించే సరికి త్రివిక్రం సినిమా కోసం తారక్ ప్రిపేర్ అవుతున్నాడని అనుకుంటున్నారు. ఐతే గురూజీ ఈ సినిమా ఎప్పుడు మొదలు పెడతాడు అన్నది ఇంకాస్త క్లారిటీ రావాల్సి ఉంది. త్రివిక్రం తారక్ సినిమా కన్నా ముందు వెంకటేష్ తో సినిమా చేయబోతున్నాడని టాక్.వెంకటేష్ తో సినిమా పూర్తి చేశాకే గురూజీ ఎన్టీఆర్ మూవీ ఉంటుందని తెలుస్తుంది. ఇక ఈ సినిమాతో పాటుగా ఎన్టీఆర్ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ తో కూడా ఒక సినిమా ఉంటుందని తెలుస్తుంది. బీస్ట్, జైలర్ సినిమాలతో తన సత్తా చాటిన నెల్సన్ ఎన్టీఆర్ కి ఒక అదిరిపోయే కథ చెప్పాడట. ఆ సినిమా త్రివిక్రం సినిమా తర్వాత ఉంటుందని టాక్. ఐతే స్పెషల్ న్యూస్ ఏంటంటే త్రివిక్రం, నెల్సన్ రెండు సినిమాలు కూడా ఒకే బ్యానర్ లో చేస్తున్నాడత ఎన్టీఆర్. సితార బ్యానర్ లోనే త్రివిక్రం, ఎన్టీఆర్ సినిమా ఉంటుంది. త్రివిక్రం డైరెక్షన్ లోనే అత్యంత భారీ బడ్జెట్ సినిమాగా అది ఉండబోతుందట. ఆ నెక్స్ట్ నెల్సన్ సినిమా కూడా సితార బ్యానర్ లోనే తెరకెక్కిస్తారని తెలుస్తుంది. దీని గురించి నిర్మాత నాగ వంశీ స్వయంగా వెల్లడించారు. సో ఎన్టీఆర్ తో రెండు సినిమాలు అది కూడా భారీ ప్రాజెక్ట్ లుగా ఈ మూవీస్ రాబోతున్నాయి. సో ఈ సినిమాలు వస్తే.. సితార బ్యానర్ పేరు పాన్ ఇండియా రేంజ్ మారిమోగిపోవడం పక్కా అని చెప్పొచ్చు. వార్ 2 తో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న ఎన్టీఆర్.. రాబోయే సినిమాలతో కూడా పాన్ ఇండియా లెవెల్ లో షేక్ చేసే ప్లాన్ లో ఉన్నారని చెప్పొచ్చు.